PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 69 | పేజీలు : 8 | శుక్రవారం 7 ఆగస్టు 2026 | వెల : 4/-









## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్

- యూపీఐ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- వాయిస్ ఓటుతో చర్చ లేకుండానే బిల్లు పాస్
- యూపీఐపై ఛార్జీలకు చట్టపరమైన మార్గం
- ఎండీఆర్ మినహాయింపు నిబంధన తొలగింపు
- పెద్ద వ్యాపారులకే ఛార్జీలు వర్తించే అవకాశం





## జేఈఈ తరహాలో నీట్

- నీట్‌లో పెన్, పేపర్ విధానానికి స్వస్తి
- ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షపై సమాలోచనలు : కేంద్రం
- నీట్-యూజీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహణపై సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్
- నీట్ యూజీ పరీక్షల నిర్వహణలో సమూల మార్పులకు కేంద్రం సన్నాహాలు

# నీళ్లు.. నిధులు.. నియామకాలు!

## తెలంగాణలో మళ్లీ ఉద్యమం నాటి సెగలు!

- తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాల అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు
- గోదావరి జలాల నుంచి ఢిల్లీ నిధులు, ఉద్యోగాల భర్తీ వరకు పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు
- తెలంగాణ సెంటిమెంట్‌ను కేంద్రంగా చేసుకుని ఇరు పార్టీలు ప్రజల్లో పైచేయి సాధించేందుకు వ్యూహాలు అమలు




హైదరాబాద్

'నీళ్లు'. కోటి ఎకరాలకు, లక్షలాది రైతులకు ప్రాణాధారమైన ఈ జలాలపైనే. ఇప్పుడు రాష్ట్రంలో మరోసారి పొలిటికల్ హీట్ పీక్స్‌కు చేరింది. గోదావరి, కృష్ణా నదీ జలాల సాక్షిగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మరోసారి జలయుద్ధం మొదలైంది. తెలంగాణ నీటి ప్రయోజనాలను సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రాకు తాకట్టు పెట్టారంటూ మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలు గుప్పించారు. ఇంతకీ, గోదావరి బోర్డు మీటింగ్ అజెండాలో ఏముంది? తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై హరీష్‌రావు వాదన ఏంటి? దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ ఇచ్చిన కౌంటర్ ఏంటి? తెలంగాణ నీటి హక్కులను ఆంధ్రాకు తాకట్టు పెట్టడానికి కారణం.. - మిగతా3లో



## తెల్లరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారు

- ఆగస్టు 15 నుంచి తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ
- ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా శ్రీకారం
- రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో 1.05 కోట్ల కార్డులను పంపిణీ చేస్తాం
- లబ్ధిదారుల జాబితాల ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల్లో ఏర్పాట్లు

హైదరాబాద్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. త్వరలో కొత్త తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఆగస్టు 15 నుంచి కొత్త తెల్లరేషన్ కార్డులు పంపిణీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి - మిగతా3లో

## రూ.3.25లక్షల కోట్లతో 114 రఫేల్ యుద్ధ విమానాలు

- డీల్‌పై భారత్‌కు ప్రపోజల్ పంపిన ఫ్రాన్స్- ఇక్కడే జెట్ల తయారీ!
- రూ. 3.25 లక్షల కోట్ల 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఫ్రాన్స్ ప్రతిపాదన
- మొత్తం 114లో 94 రఫేల్ జెట్లు భారత్‌లోనే తయారీ
- దేశీయ పారిశ్రామిక రంగానికి ఊతం



## ఆధార్‌తో ఎరువుల కొనుగోలు ప్రక్రియ



- తెలంగాణ రైతులకు ప్రభుత్వం మరో గుడ్ న్యూస్..
- అకౌంట్లో డబ్బులు జమ..
- జొన్న రైతుల అకౌంట్లలో డబ్బులు జమ
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- దాదాపు 1.01 లక్షల మంది రైతులకు బదిలీ చేసినట్లు స్పష్టం

హైదరాబాద్

తెలంగాణలోని రైతులకు రేవంత్ సర్కార్ శుభవార్త అందించింది. జొన్న రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1.01 లక్షల మంది అకౌంట్లకు వీటిని నేరుగా బదిలీ చేసింది. వీరికి దాదాపు రూ.994 కోట్లు అందించినట్లు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జొన్నలు విక్రయించిన రైతులకు డబ్బులను విడుదల చేసింది. మద్దతు ధరకే రైతుల నుంచి ప్రభుత్వం జొన్నలు సేరిస్తోంది. రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని తెలిపిన ప్రభుత్వం.. దేశానికి ఆదర్శంగా నిలిచేలా తెలంగాణలో జొన్న కొనుగోలు విధానాన్ని తీసుకొచ్చినట్లు స్పష్టం చేసింది. అయితే - మిగతా3లో



## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్

- విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు.. విశాఖపై పెరుగుతున్న పెట్టుబడిదారుల ఆసక్తి
- నైట్ ఫ్రాంక్ నివేదికలో ముంబయికి ప్రపంచ టాప్-15లో చోటు
- హైదరాబాద్‌కు భారీ ప్రాజెక్టుల వరుస.. విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల అవకాశాలు
- క్లౌడ్, ఏఐతో పెరుగుతున్న డిమాండ్.. భారత్‌కు బలపడుతున్న గ్లోబల్ గుర్తింపు

# పుంజుకున్న వరి సాగు

- రాష్ట్రంలో పెరుగుతోన్న వరి సాగు
- 70.15 శాతానికి చేరిన అన్ని పంటల మొత్తం సాగు విస్తీర్ణం
- ప్రభుత్వానికి నివేదిక అందజేసిన వ్యవసాయ శాఖ
- రుతుపవనాలు పుంజుకుని వర్షాలు పడటంతో మొన్నటివరకు వెలవెలబోయిన ప్రాజెక్టులు ప్రస్తుతం జలకళను సంతరించుకుంటున్నాయి



హైదరాబాద్

తెలంగాణలో వర్షాకాలంలో ప్రధాన పంట అయిన వరి సాగు క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుత వానకాల సీజన్‌లో ఈ పంట సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతోంది. వ్యవసాయ శాఖ ప్రారంభంలో కరవు పరిస్థితుల అంచనాలతో సాగు తగ్గుతుందని భావించినప్పటికీ, ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు పెద్ద ఎత్తున వరి నాట్లు వేస్తున్నారు. బుధవారం నాటికి వరి సాగు 44.47 శాతానికి చేరుకుంది. గత ఏడాది ఇదే సమయానికి సాగు విస్తీర్ణం 29,22,348 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం అది 29,32,884 ఎకరాలకు పెరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంటల మొత్తం సాగు విస్తీర్ణం 70.15 శాతానికి చేరింది. జూన్, జులై నెలల్లో వర్షపాతం లోపం ఉన్నప్పటికీ, ఈ నెలలో వర్షపాతం సగటు కంటే కొంచెం ఎక్కువగా నమోదైంది. అయితే తొమ్మిది జిల్లాలు, 230 మండలాల్లో ఇంకా వర్షపాతం లోపం కొనసాగుతోంది. ఈ పరిస్థితిపై వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. మొత్తం సీజనల్ లక్ష్యం 1,32,38,446 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 92,86,726 ఎకరాల్లో పంటలు వేశారు. సాధారణ విస్తీర్ణం 65,95,645 ఎకరాలు కాగా, వరి 29,32,884 ఎకరాల్లో సాగు చేశారు. అలాగే పప్పు ధాన్యాలు 5,64,288 ఎకరాల్లో, నూనె గింజలు 3,74,363 - మిగతా3లో

## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం



- పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు పెరగనున్న డిమాండ్
- సీబీజీ ఉత్పత్తిని పది రెట్లు పెంచే లక్ష్యం
- సీబీజీకి ప్రభుత్వం మద్దతుతో స్థిర ధర
- కొత్త బయోగ్యాస్ ప్లాంట్లకు రూ.2 కోట్ల వరకు సాయం

నవగీతం
తెలుగు దినపత్రిక

శుక్రవారం
7 ఆగస్టు 2026

# రూ.3.25లక్షల కోట్లతో 114 రఫేల్ యుద్ధ విమానాలు



భారత వైమానిక దళం సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. 114 రఫేల్ మల్టీ రోల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. దాదాపు రూ. 3.25 లక్షల కోట్ల విలువైన ఈ మెగా డీల్‌పై ఫ్రాన్స్ నుంచి ఎట్టకేలకు స్పందన వచ్చింది. భారత్‌కు తాజాగా దీనిపై సమగ్ర సాంకేతిక, వాణిజ్య ప్రతిపాదనను (టెక్నికల్ అండ్ కమర్షియల్ ప్రపోజల్) సమర్పించింది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, భారత వైమానిక దళానికి చెందిన అక్విజిషన్ వింగ్ ప్రస్తుతం ఈ ప్రపోజల్‌ను నిశితంగా పరిశీలిస్తున్నట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. భారత్ ఈ ఏడాది మే నెలలో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన లెటర్ ఆఫ్ రిక్వెస్ట్‌ను ఫ్రాన్స్‌కు పంపింది. దానికి ప్రతిస్పందనగానే ఆ దేశం ఇప్పుడు తమ పూర్తి ప్రతిపాదనను పంపింది. ఇందులో విమానాల తయారీ, సాంకేతిక పరిజ్ఞానం, స్వదేశీకరణ అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఒప్పందంలోని మొత్తం 114 రఫేల్ ఫైటర్ జెట్లలో 94 విమానాల్ని భారత్‌లోనే స్థానిక భాగస్వాములతో కలిసి తయారు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల పలు ప్రముఖ భారతీయ కంపెనీలకు పెద్ద మొత్తంలో వ్యాపార అవకాశాలు దక్కనున్నాయి.

**మేక్ ఇన్ ఇండియాకు మరింత ఊతం**

ఈ ప్రతిపాదనలో అత్యంత కీలకమైన అంశం స్థానికంగా తయారీ. ఇది మేక్ ఇన్ ఇండియాకు మరింత ఊతం అందించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒప్పందం కింద 94 రఫేల్ యుద్ధ విమానాల్ని భారత్‌లో తయారు చేయాలి. ఇక్కడ ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్, మిస్సైల్ తయారీ సంస్థ వీడీణూ, ఇంజిన్ తయారీదారు సఫ్రాన్, రాడార్, ఎలక్ట్రానిక్స్ రంగంలోని థేల్స్ సంయుక్తంగా భారతీయ భాగస్వామ్య సంస్థలతో కలిసి పనిచేస్తాయి. ఈ ప్రాజెక్టు ద్వారా భారత పరిశ్రమలకు భారీ అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా టాటా, లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ- ూడు) సహా పలు భారతీయ కంపెనీలకు రూ. 1.6 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి, సరఫరా వ్యాపార అవకాశాలు వస్తాయని అంచనా. ఇంకా ఈ ఒప్పందంలో భారత్ అభివృద్ధి చేసిన అస్త్ర (ూర్తీు) గగనతల క్షిపణుల అనుసంధానం, అలానే స్వదేశీ పరికరాల వినియోగంపై కూడా భారత్ ప్రత్యేకంగా డిమాండ్ చేసింది. మరి ఫ్రాన్స్ పంపిన ప్రతిపాదనలో ఈ అంశాలకు సంబంధించి ఎలాంటి వివరణ ఇచ్చిందోననే విషయాన్ని భారత అధికారులు పరిశీలిస్తున్నారు.

**తగ్గుతున్న మిగ్ యుద్ధ విమానాలు- రఫేల్ తప్పనిసరి!**

ప్రస్తుత భారత వైమానిక దళం వద్ద ఉన్న రష్యాకు చెందినటువంటి పాత మిగ్ (వీఱ+) యుద్ధ విమానాల్ని దశల వారీగా సేవల నుంచి తప్పిస్తున్నారు. మరోవైపు ఇదే సమయంలో స్వదేశీ ౌజూ మ్షితీఏ- 1ూ, ౌజూ మార్క్-2 విమానాల్ని తీసుకురావడంలో ఆలస్యమవుతోంది. వీటి ఉత్పత్తి, సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కొత్త యుద్ధ విమానాల అవసరం అనివార్యంగా మారింది. ఇప్పటికే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (వైమానిక దళం), నేవీ ఫోర్స్ (నౌకా దళం) కలిపి 62 రఫేల్ యుద్ధ విమానాల కోసం ఆర్డర్ ఇచ్చాయి. తాజా 114 రఫేల్ ఫైటర్ జెట్ల డీల్ కూడా అమలైతే దేశంలోని రఫేల్ విమానాల సంఖ్య ఏకంగా 176 కు చేరుతుంది. అదనంగా సముద్ర మార్గ ముప్పుల్ని ఎదుర్కొనేందుకు మరో 31 రఫేల్ మెరైన్ విమానాల్ని కొనుగోలు చేయాలని భారత నౌకాదళం ఇప్పటికే తమ నుంచి ప్రతిపాదన పంపింది. దీనికి కూడా ఆమోదం లభిస్తే దేశంలో రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 200 దాటే అవకాశం ఉందని చెప్పొచ్చు. రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలో భారత వైమానిక దళం సామర్థ్యాల పెంపుపై చేపట్టిన సమీక్ష తర్వాత ఈ రఫేల్ ప్రాజెక్టు వేగవంతం అయింది. దాదాపు 5 నెలల కిందటే డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (ణూజ) కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఇప్పుడు ఫ్రాన్స్ సమర్పించిన ప్రతిపాదనపై భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత ఈ మెగా డిఫెన్స్ డీల్ తదుపరి దశకు వెళ్లనుంది.

# యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్



ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ ఎలాంటి చర్చ లేకుండానే గురువారం పలు బిల్లులను ఆమోదించింది. ముఖ్యంగా యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఛార్జీలు విధించే అధికారం బ్యాంకులకు ఇచ్చేందుకు తీసుకువచ్చిన పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్-2007 చట్ట సవరణను లోక్‌సభ ఆమోదించింది. అనంతరం శుక్రవారానికి వాయిదాపడింది.

ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. అయోధ్య రామమందిరంలో కానుకల చోరీ, విద్యార్థులపై పోలీసు చర్య అంశాలపై హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విపక్షాల నినాదాలతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టకుండానే స్పీకర్ సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా సభలో అదే పరిస్థితి కొనసాగింది.

ఈ క్రమంలోనే ఖూ×సహా ఇతర నోటిఫైడ్ డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బిల్లును విపక్షాల నినాదాల మధ్యే ఎలాంటి చర్చ లేకుండా మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. 2007నాటి పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టాన్ని సవరించారు. యూపీఐ, రూపే డెబిట్ కార్డుతో చేసే డిజిటల్ చెల్లింపులపై వీణ= ఛార్జీలు విధించకుండా ఉన్న నిబంధనను తొలగించారు. ఇకపై ఏ డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు ఉండాలో కేంద్రమే నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించనుంది. డిజిటల్ పేమెంట్ వ్యవస్థను నడిపే బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదాయం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం బిల్లులో సవరణలు చేసింది.

**ట్యాక్సేషన్, ఇతర చట్టసవరణ బిల్లును కూడా లోక్‌సభ ఆమోదం**

ఆ తర్వాత ట్యాక్సేషన్, ఇతర చట్టసవరణ బిల్లును కూడా లోక్‌సభ ఆమోదం తెలిపింది. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు భారత్?లో ఎలక్ట్రానిక్స్ వస్తువులను ఉత్పత్తి చేయడానికి కాంట్రాక్ట్ తయారీదారుని నియమించుకునే విదేశీ కంపెనీలకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆదాయపు పన్ను మినహాయింపును ఈ బిల్లు 2040-41 వరకు పొడిగిస్తుంది. ఈ బిల్లులో పేర్కొన్న నిర్దిష్ట ఎలక్ట్రానిక్ వస్తువుల్లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పర్సనల్ కంప్యూటర్లు, టాబ్లెట్‌లు, సర్వర్లు వాటి కీలక భాగాలు, అనుబంధ పరికరాలు ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలకు విడిభాగాల సరఫరాకు మద్దతుగా, కస్టమ్స్ గిడ్డంగుల్లో విడిభాగాలను నిల్వ చేసి, వాటిని భారత్?లోని కాంట్రాక్ట్ తయారీదారుకు సరఫరా చేసే విదేశీ కంపెనీలకు 2040-41 వరకు 15 సంవత్సరాల పాటు ఆదాయపు పన్ను (ఐటీ) మినహాయింపును ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది.

ఇంకా భారతీయ డేటా సెంటర్లను ఉపయోగించే విదేశీ క్లౌడ్ కంపెనీలకు ఉన్న అనుమతి, నోటిఫికేషన్ అవసరాలను కూడా ఈ బిల్లు తొలగిస్తుంది. భారతీయ డేటా సెంటర్లను కేవలం ప్రత్యక్ష యాజమాన్యం కింద కాకుండా, లీజు ప్రాతిపదికన నిర్వహించాలని కూడా ఇది ప్రతిపాదిస్తోంది. ప్రపంచ పెట్టుబడులు, తయారీ, వ్యాపారాలు భారతదేశానికి వచ్చి స్థిరపడటానికి మరింత ఆకర్షణీయమైన ప్రదేశంగా మార్చడమే ఈ బిల్లులోని ప్రతిపాదనల ఏకైక లక్ష్యమని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి.

ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభలో ఆమోదం పొందిన ఏడో బిల్లు ఇది. అయితే, ఎలాంటి చర్చ లేకుండా ఆమోదం పొందిన ఐదో బిల్లు ఇది. పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని సవరించే బిల్లుపై సభ 10 గంటల పాటు చర్చించి ఆమోదించింది. అటు జాతీయ గేయం 'వందేమాతరం'ను అవమానించడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించే బిల్లుపై ఇద్దరు సభ్యులు పాల్గొనగా, దానిపై క్లుప్తంగా చర్చ జరిగిన తర్వాత ఆమోదించింది.

## ప్రధాని మోదీకి ఫోన్ చేసిన ఇజ్రాయెల్ ప్రధాని

**ఇరుదేశాల పురోగతిపై చర్చ**

**ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతంపై చర్చలు**

**పశ్చిమాసియాలోని పరిణామాలపై ఆరా**

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఒక కీలక పరిణామం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. పశ్చిమాసియాలోని ప్రస్తుత పరిణామాలపై నెతన్యాహుతో మోదీతో చర్చించారు. మోదీకి ఫోన్ చేసిన నెతన్యాహు ఇరుదేశాల ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేలా చర్చలు జరిపారు. భారత్- ఇజ్రాయెల్ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధించిన స్థిరమైన ప్రగతిని నేతలు సమీక్షించారు.

రెండు దేశాల పరస్పర ప్రయోజనాల కోసం వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతానికి కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించారు. అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నుంచి తనకు ఫోన్?కాల్? వచ్చినట్లు మోదీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఆ కాల్ సంభాషణలో ఇరుదేశాల మధ్య సంబంధించిన పురోగతిపై సమీక్షించామని తెలిపారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులపై అభిప్రాయాలను పంచుకున్నామని చెప్పారు.

కాగా, భారత్, ఇజ్రాయెల్ దేశాలు పలు కీలక రంగాల్లో తమ సహకారాన్ని విస్తరిస్తూనే వస్తున్నాయి. ఇటీవల జూలై ప్రారంభంలో, ఇరు దేశాలు ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఖీూు) కోసం రెండో విడత చర్చలను ముగించాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో పరస్పర సమగ్రమైన ఒప్పందాన్ని త్వరగా ముగించే దిశగా కృషి చేస్తామని పునరుద్ఘాటించాయి. పశ్చిమాసియాలో సంఘర్షణ ఉన్నప్పటికీ భారత్-ఇజ్రాయెల్ సంబంధాలు అద్భుతమైన పథంలో కొనసాగుతున్నాయని భారత్?లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ కొద్దిరోజుల క్రితం పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సంఘర్షణ ఉన్నప్పటికీ, రక్షణ, మౌలిక సదుపాయాలు, ఆర్థిక, వాణిజ్య రంగాల్లో భారత్?తో విస్తరిస్తున్న సహకారమే ఈ పథానికి కారణమని అజార్ పేర్కొన్నారు. గత మూడేళ్లుగా ద్వైపాక్షిక భాగస్వామ్యం బలోపేతం అవుతూనే ఉందని, ఇరు దేశాలు పలు రంగాల్లో తమ సంబంధాలను మరింతగా పెంచుకుంటున్నాయని ఆయన తెలిపారు. భారత్-ఇజ్రాయెల్ దేశాల మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో అత్యున్నత స్థాయి ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా రూపాంతరం చెందాయి. 1950లో భారతదేశం ఇజ్రాయెల్‌ను గుర్తించినప్పటికీ, 1992లోనే ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. నాటి నుండి నేటి వరకు రక్షణ, సాంకేతికత, వ్యవసాయ రంగాల్లో ఈ బంధం విపరీతంగా బలపడింది. 2026 ఫిబ్రవరి 25-26 తేదీలలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో అధికారిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఇరు దేశాల బంధాన్ని శాంతి, ఆవిష్కరణలు, శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచారు. ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ, ప్రపంచంలో తమకున్న అత్యంత సన్నిహిత మిత్రులలో ప్రధాని మోదీ ఒకరని కొనియాడారు. అంతర్జాతీయంగా ఇజ్రాయెల్‌కు భారత్ అందిస్తున్న మద్దతు ఎంతో విలువైనదని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదారులు మరోసారి రెచ్చిపోయారు. యెమెన్‌లోని సైనిక శిబిరాలపై హూతీ రెబల్స్ భారీ దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో 30 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మందిపైగా సైనికులు గాయపడ్డారు.

## రైతుల కోసం కేంద్రం

## రూ.23,731 కోట్ల 'గోబర్‌ధన్' పథకం

వ్యవసాయ అవశేషాలు, పశువుల వ్యర్థాలతో అదనపు ఆదాయం పొందేలా రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అవకాశం కల్పించింది. బయోగ్యాస్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్‌ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2035-36 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశీయంగా 'కంప్రెస్డ్ బయోగ్యాస్' (సీబీజీ) ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి సేకరించే పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి. సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీయూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది. కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది. సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్..

భారత్ డేటా సెంటర్ రంగంలో వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. విశాఖపట్నం భారీ స్థాయి కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఆకర్షణీయ గమ్యంగా మారుతోంది. ఈ విషయాలు నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడయ్యాయి. ప్రపంచంలోని 36 ప్రధాన డేటా సెంటర్ మార్కెట్లపై నిర్వహించిన అధ్యయనంలో ముంబయి ఆపరేషనల్ సామర్థ్యం పరంగా 15వ స్థానంలో నిలిచింది. అభివృద్ధి దశలో ఉన్న ప్రాజెక్టుల జాబితాలో 11వ స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ ప్రస్తుతం 151 మెగావాట్ల సామర్థ్యంతో 27వ స్థానంలో ఉన్నా, 2.2 గిగావాట్లకు పైగా అభివృద్ధి ప్రణాళికలతో 19వ స్థానంలో నిలిచి వేగంగా విస్తరిస్తున్న కేంద్రంగా గుర్తింపు పొందింది. చెన్నై ఆగ్నేయాసియా ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు కీలక కేంద్రంగా బలపడుతుండగా, బెంగళూరు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, పరిశోధన సంస్థల పెట్టుబడులను ఆకర్షిస్తోంది. మరోవైపు పుణె, ఢిల్లీ ఎన్‌సీటీ ప్రాంతంలో కూడా డేటా సెంటర్ల సామర్థ్యం పెరుగుతోంది. రెండో శ్రేణి నగరాల్లో విశాఖపట్నం, జామ్‌నగర్ భారీ గ్రీన్‌ఫీల్డ్ డేటా సెంటర్ ప్రాజెక్టులకు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు, సముద్రగర్భ కేబుల్ కనెక్టివిటీ ప్రణాళికలు ఇందుకు దోహదపడుతున్నాయని వెల్లడించింది. క్లౌడ్ సేవల వినియోగం పెరగడం, కృత్రిమ మేధ వినియోగం విస్తరించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగడం వల్ల భారత్‌లో డేటా సెంటర్లకు డిమాండ్ మరింత పెరుగుతోందని నైట్ ఫ్రాంక్ ఇండియా అభిప్రాయపడింది. విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల విస్తరణ, వేగవంతమైన అనుమతులు ఉంటే రానున్న దశాబ్దంలో భారత్ ప్రపంచంలోనే కీలక డేటా సెంటర్ల కేంద్రంగా ఎదిగే అవకాశముందని పేర్కొంది.

## జేఈఈ తరహాలో నీట్




దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్-యూజీ పరీక్ష నిర్వహణలో సమూల మార్పులకు కేంద్రం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఉన్న పెన్- అండ్-పేపర్ విధానానికి స్వస్తి పలికి ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షగా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఎన్టీఏ స్థానంలో స్వతంత్ర, బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న పిటిషన్లపై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో నీట్-యూజీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహణపై సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో కేంద్రం పలు విషయాలను ప్రస్తావించింది. జేఈఈ తరహాలో నీట్ నిర్వహణకు కసరత్తు చేస్తున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. నందన్ నీలేకని అధ్యక్షతన ఏర్పాటైన హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల ఆధారంగానే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. కంప్యూటర్ ఆధారిత విధానంలోకి మారితే దానిని వీలైనంత త్వరగా అమలు చేయాలని వైద్యుల సంఘం తరఫున పిటిషనర్లు కోర్టును కోరారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు వివరించారు. అయితే కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై సమాధానం ఇవ్వాలని వైద్యుల సంఘంతో సహా పిటిషనర్లను సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

**హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల ఆధారంగానే తుది నిర్ణయమన్న కేంద్రం**

"నీట్ ఖ+ విషయంలో పెన్ -పేపర్ విధానం నుంచి కంప్యూటర్ ఆధారిత విధానానికి మారే అంశంపై ప్రస్తుతం సంబంధిత వర్గాలన్నీ చురుగ్గా పరిశీలన జరుపుతున్నాయి. ఇది జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (మెయిన్స్ -అడ్వాన్స్‌డ్ తరహాలో ఒకే దశలో లేదా రెండు దశల్లో ఉండవచ్చు. నందన్ నీలేకని నేతృత్వంలోని ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది విధానాన్ని అనుసరిస్తాం. సాంకేతికత, అంతరిక్షం, ఇంటెలిజెన్స్, విద్యా రంగం, ప్రజా పరిపాలన వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన నిపుణులతో కూడిన ఈ టాస్క్ ఫోర్స్, విధాన మార్పునకు సంబంధించిన సాంకేతిక, భద్రతా, సమానత్వ, మౌలిక సదుపాయాలు, బోధనాపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలిస్తుంది." అని కేంద్రం అఫిడవిట్?లో పేర్కొంది.

ప్రశ్నపత్రాల లీకులు, వ్యవస్థాగత వైఫల్యాలను నిర్మూలించేందుకు జాతీయ అర్హత-ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణలో సమగ్ర మార్పులు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. ప్రశ్నాపత్రాల లీకులు, నకిలీ గుర్తింపు, కంప్యూటర్ వ్యవస్థలను తారుమారు చేయడం, ఇతర పరీక్షా సంబంధిత నేరాలను నేరంగా పరిగణించే 2024 చట్టాన్ని విస్తరిస్తూ, పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ చట్టం- 2026 తీసుకువచ్చామని కేంద్రం చెప్పింది. ఈ చట్టం ద్వారా పరీక్షల మోసానికి వ్యతిరేకంగా పార్లమెంటు చట్టపరమైన వ్యవస్థను మరింత బలోపేతం చేసిందని కేంద్రం తెలిపింది.

**ముందే స్పష్టత ఇవ్వాలని ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి చేసిన వైద్యుల సంఘం**

అటు ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ తరపున న్యాయవాది తన్వీ దూబే ధర్మాసనానం ఎదుట హాజరయ్యారు. ఒకవేళ కంప్యూటర్ ఆధారిత విధానానికి మారే ప్రణాళిక ఉంటే, అది వీలైనంత త్వరగా జరగాలని ఆమె కోరారు. ఎందుకంటే ప్రస్తుతం విద్యార్థుల సన్నద్ధత పెన్- పేపర్ విధానం ఆధారంగానే సాగుతోందని తెలిపారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పిన ధర్మాసనం, సంబంధిత పక్షాలను తమ సమాధానాలు, సూచనలను దాఖలు చేయాలని చెప్పింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీూ)లో సంస్కరణలు కోరుతూ =జీణ ఎంపీ సుధాకర్ సింగ్ తరపున సీనియర్ న్యాయవాది పిజుష్ కాంతి రాయ్, న్యాయవాది సత్యం సింగ్ రాజ్‌పుత్ హాజరయ్యారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
7 ఆగస్టు 2026

# ఇక ఎరువుల పంపిణీకి ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్

**దేశవ్యాప్తంగా ఈ ఖరీఫ్ నుంచే అమలు...**

**ఇప్పటికే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు**

**గురువారం నుంచి మరో 10 జిల్లాలకు విస్తరణ**







**హైదరాబాద్:** ఎరువుల పంపిణీలో పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్ (ఎఫ్‌ఎఫ్‌ఎస్) విధానా న్ని తెలంగాణలో మరో 10 జిల్లాలకు విస్తరించారు. కేంద్ర ప్రభుత్వం ఎరువుల పంపిణీ కోసం రూపొందించిన ఈ ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌ను పైలెట్ ప్రాజెక్టుగా మొదటి దశలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రారంభించారు. దీనికి కొనసాగింపుగా రెండో దశలో గురువారం నుంచి నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, కుమురం భీం--ఆసిఫాబాద్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లో అమలు చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో రైతులు ఎరువుల కోసం ముందుగా ఈ యాప్‌ను తమ స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని, రైతు వివరాలు పొందుపరచాలి. అనంతరం ఆయా జిల్లాల్లోని దుకాణాలు, పీఏసీఎస్‌లలో లభ్యతను బట్టి ఎరువులు రైతులకు పంపిణీ అవుతాయి.

**'ఫెర్టిలైజర్ యాప్'ఆదర్శంగా...**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రాష్ట్రంలో వ్యవసాయ శాఖ గత సంవత్సరం ఖరీఫ్‌లో 'ఫెర్టిలైజర్ యాప్'ను రూపొందించింది. ఖరీఫ్ సీజన్ మధ్యలో ప్రారంభించిన ఈ యాప్ కొన్ని జిల్లాలకే పరిమితమైంది. అయితే గత రబీ (యాసంగి) సీజన్ నాటికి ఈ యాప్‌ను పూర్తిస్థాయిలో అమలు చేశారు. ఈ యాప్ పనితీరును పరిశీలించిన కేంద్ర వ్యవసాయశాఖ ఈ ఖరీఫ్ నుంచి దేశమంతా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే 'ఫెర్టిలైజర్ యాప్'నమూనాతో 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్'యాప్‌ను రూపొందించింది.

**ఎఫ్‌ఎఫ్‌ఎస్ ఎలా పనిచేస్తుందంటే...**

రైతు మొబైల్‌లో ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆధార్/రైతు ఐడీ, మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకుంటాడు. రైతు అవసరమైన ఎరువు (యూరి యా, డీఏపీ, ఎన్‌పీకే మొదలైనవి), కావాల్సిన పరిమాణం, ఏ డీలర్ లేదా పీఏసీఎస్ వద్ద తీసుకోవాలనుకుంటున్నాడో యాప్‌లో ఎంపిక చేసుకుంటాడు. దీంతో ఆ డీలర్ వద్ద స్టాక్ ముందుగానే రిజర్వ్ అవుతుంది. బుకింగ్ పూర్తయ్యాక రైతు మొబైల్‌కు ప్రత్యేక క్యూఆర్ కోడ్ వస్తుంది. అదే కొనుగోలు టోకెన్‌గా పనిచేస్తుంది. రైతు ఎంపిక చేసిన దుకాణానికి వెళ్లి క్యూఆర్ కోడ్ చూపిస్తాడు. ఆధార్ ఆధారిత ధ్రువీకరణ అనంతరం ఎరువులు అందజేస్తారు. ఈ యాప్ ద్వారా తమ సమీపంలోని ఏ దుకాణంలో, ఎంత స్టాక్ ఉందో రైతు యాప్‌లోనే చూడొచ్చు. 'ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంచేందుకు గత సంవత్సరం రాష్ట్రంలో అమలు చేసిన 'ఫెర్టిలైజర్ యాప్'ను కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేస్తుండడం శుభపరిమాణం'అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.

# హైదరాబాద్‌కు దక్షిణ మణిహారం సిద్ధమవుతోంది



హైదరాబాద్ మహానగరానికి దక్షిణ సరిహద్దులో రవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరించేలా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన రతన్?టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు-1 పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్? సిటీని అనుసంధానించేలా ఈ ప్రాజెక్టు నిలవనుంది. ఈ రహదారి కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వారి భూములను అందించారు. దీంతో భూసేకరణ పనులు వేగవంతం కావడం వల్ల వాటిని చదును చేసి చకచకా పనులు చేపడతున్నారు. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో చేపడుతుండగా మొత్తం రూ.4,621 కోట్లు ఖర్చు చేయనున్నారు.

అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)లోని ఎగ్జిట్ 13 రావిర్యాల ఇంటర్ ఛేంజ్ నుంచి ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)లోని ఆమనగల్లును అనుసంధానిస్తూ ఈ రోడ్డు నిర్మాణం కానుంది. ఈ రేడియల్ రోడ్డు మొత్తం పొడవు 41.5 కిలోమీటర్లు. ఆరు లేన్లతో, 100 మీటర్ల వెడల్పుతో యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్‌గా రూపుదిద్దుకోనుంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని 8 లేన్లకు విస్తరించే సదుపాయం కల్పించారు.

**రహదారి మధ్యలో మెట్రో కోసం 20 మీటర్లు**

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో ప్రధానంగా రహదారి మధ్యలో 20 మీటర్ల విస్తీర్ణాన్ని మెట్రో, ఎంఎంటీఎస్? కారిడార్ల నిర్మా ణం కోసం ప్రత్యేకంగా కేటాయిస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో ప్రజారవాణా కూడా అనుసంధానం కావడానికి అవ కాశం ఉంది. రహదారిని అత్యాధునిక ప్రమాణాలతో యాక్సెస్ కంట్రోల్డ్‌గా నిర్మిస్తుండటం వల్ల దక్షిణ హైదరా బాద్‌కు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఐటీ, ఇతర పరిశ్రమలను నగరానికి అన్ని వైపులా విస్తరించేందుకు అనుకూలం కానుంది.

**14 గ్రామాల్లో వెయ్యి ఎకరాల సేకరణ**

రెండు దశల్లో నిర్మాణమవుతున్న ఈ ప్రాజెక్టులో ముందుగా రావిర్యాల నుంచి మీర్?ఖాన్? పేట దాకా 19.2 కిలోమీటర్ల మేర పనులను రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థ చేపడుతోంది. రెండో విడతో భాగంగా మీర్?ఖాన్?పేట నుంచి ఆమనగల్లు దాకా 22.3 కిలోమీటర్లను ఎల్? అండ్? టీ సంస్థ నిర్మిస్తోంది. ఈ రేడియల్ రోడ్డు కోసం రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లోని 14 గ్రామాల పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల భూమి సేకరిస్తున్నారు.

**భూసేకరణ వేగంగా కావడంతో**

ప్రాజెక్టులో భాగంగా హెచ్‌ఎండీఏకు అప్పగించిన భూమిలో కొండలను తొలగించి రహదారికి అనువుగా మార్చుతున్నారు. భూమిని చదును చేసే పనులు జోరుగా సాగుతున్నాయి. అవసరం మేరకు అండర్? పాస్?లు, చిన్న బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. భూసేకరణ ప్రక్రియ చాలా వేగంగా జరిగిపోవడంతో రేడియల్ రోడ్డు త్వరగా రూపుదిద్దుకోనుంది.

**మరిన్ని రేడియల్ రోడ్లకు కసరత్తులు**

ఇది పూర్తయితే ఐటీ హబ్‌లు, పారిశ్రామిక వడాలు, లాజిస్టిక్ హబ్?లు, ఫార్మా కంపెనీలు భారీ ఎత్తున నెలకొల్పే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగం కూడా పుంజుకోనుంది. దీంతో పాటు హెచ్‌ఎండీఏ మరో 10 రేడియల్ రోడ్ల కోసం ప్రణాళికలు రూపొందించింది. ఇందులో ఓఆర్?ఆర్? ఎగ్జిట్లు 2,4,8,10,15,17 నుంచి పలు రహదారులకు సంబంధించి కూడా ఏర్పాట్లు చేస్తోంది. ఇలా నగరం చుట్టూ అన్ని వైపుల నుంచి అనుసంధానం చేయడం వల్ల రవాణాకు సులభతరం కావడంతో పాటు అభివృద్ధి సాధించే అవకాశం ఉంది.

# తెలంగాణలో సంక్షేమ గూటికి గిగ్ వర్కర్లు

రాష్ట్రంలోని గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రతకు సంబంధించి ప్రభుత్వం త్వరలో నిబంధనలను జారీ చేయనుంది. 'తెలంగాణ ప్లాట్‌ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు-2025'కు శాసనసభ నుంచి ఇప్పటికే ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి బిల్లుకు సంబంధించిన నియమ నిబంధనలు, విధి విధానాలను జారీ చేయడం ద్వారా నూతన చట్టం అమలుకు మార్గం సుగమం కానుంది. ఇందుకోసం శక్తి (స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్) శాఖ కార్యాచరణను సిద్ధం చేస్తోంది. గిగ్ వర్కర్ల సంక్షేమ పథకాలను పర్యవేక్షించడానికి శక్తి శాఖ మంత్రి నేతృత్వంలో ఒక ప్రత్యేక బోర్డు ఏర్పాటు కానుంది.




**తొలగించాలంటే వారం ముందే నోటీస్ ఇవ్వాలి**

ఈ నూతన చట్టం అమలులోకి వచ్చిన తర్వాత కార్మికులకు సామాజిక భద్రత, బీమా పథకాలను కల్పించేందుకు ప్రభుత్వం ఒక సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తుంది. ప్లాట్‌ఫాం ఆధారిత కంపెనీలు ఈ నిధికి తప్పనిసరిగా తమ వాటాను జమ చేసేలా చర్యలు తీసుకుంటుంది. అగ్రిగేటర్లు గిగ్ వర్కర్ల వివరాలకు సంబంధించిన తాజా సమాచారం, మార్పులను ప్రతి 60 రోజులకు ఒకసారి బోర్డుకు సమర్పించాల్సి ఉంటుంది. ఉద్యోగ భద్రతను కల్పించేందుకు గానూ కనీసం ఒక వారం ముందు నోటీస్ ఇవ్వకుండా కార్మికులను తొలగించడాన్ని నిషేధించే నిబంధనను ఇందులో చేర్చారు.

**గిగ్ వర్కర్లకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ఐడీ**

నూతన చట్టం ప్రకారం గిగ్ వర్కర్లకు సంస్థలు సకాలంలో చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటారు. వినియోగదారు లను శారీరకంగా లేదా మానసికంగా వేధించే కార్మికులను కంపెనీలు నేరుగా తొలగించవచ్చని సూచించారు. ప్రభుత్వ పోర్టల్‌లో నమోదైన ప్రతి గిగ్ వర్కర్?కు ఒక రిజిస్ట్రేషన్ ఐడీ లభిస్తుంది. దీని ద్వారా వారికి సామాజిక భద్రతా పథకాలు పొందే అవకాశం కలుగుతుంది. అదనంగా అగ్రిగేటర్లు గిగ్ వర్కర్లకు చేసే చెల్లింపులలో 1 నుంచి 2 శాతం మొత్తాన్ని సంక్షేమ నిధికి బదిలీ చేస్తారు.

**ఉల్లంఘిస్తే రూ.50 వేల జరిమానా**

ఈ చట్టం ద్వారా గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం ఒక కార్పస్ నిధిని ఏర్పాటు చేస్తుంది. ప్లాట్‌ఫామ్స్ వర్కర్లకు చేసిన చెల్లింపులు లేదా ఏవైనా కోతలు ఉంటే వాటి వివరాలను అగ్రిగేటర్లు తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది. ఈ చట్టాన్ని ఉల్లంఘించే సంస్థలకు, ప్లాట్‌ఫాం వర్కర్లకు రూ.50 వేల జరిమానా విధించేటట్లు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం నిబంధనలు పొందుపరిచింది.

**3 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం**

రాష్ట్రంలో వివిధ రంగాల్లో సుమారు 3 లక్షల మంది గిగ్ వర్కర్లు పని చేస్తున్నారని అంచనా. ఉద్యోగ భద్రత, బీమా లేకపోవడంతో వీరు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమ కుటుంబ పోషణ కోసం రోజువారీ ఆర్డర్లపై ఆధారపడుతున్నారు. సకాలంలో సేవలను అందించే క్రమంలో చాలా మంది ప్రమాదాలకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2024 డిసెంబర్ 23న కార్మిక శాఖ, ప్లాట్‌ఫాం ఆధారిత కంపెనీలు, అగ్రిగేటర్ వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వారి సమస్యలు, డిమాండ్లను పరిశీలించారు.

**గిగ్ వర్కర్ల సంక్షేమంలో ఐదో రాష్ట్రంగా**

సీఎం సమీక్ష తర్వాత గిగ్ వర్కర్ల కోసం అవసరమైన పథకాల అమలును సులభతరం చేసేందుకు కార్మిక శాఖ 2025 ఏప్రిల్ 14న ఒక ముసాయిదా బిల్లును ప్రకటించింది. అగ్రిగేటర్లు, ప్రజలు, ప్లాట్‌ఫాం కంపెనీల నుంచి వచ్చిన 250కి పైగా వినతులు, అభ్యంతరాలను పరిశీలించింది. అందుకు తగిన మార్పులు చేసిన తర్వాత ఈ బిల్లును శాసన సభ ఆమోదించింది. దీని ద్వారా కర్ణాటక, ఝార్ఖండ్, రాజస్థాన్, బిహార్ రాష్ట్రాల తర్వాత గిగ్ వర్కర్లకు భద్రతా చర్యలు కల్పిస్తున్న ఐదో రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

## ఆధార్‌తో ఎరువుల కొనుగోలు ప్రక్రియ..

-మొదటిపేజీ తరువాయి

జొన్న రైతులకు అకౌంట్లో డబ్బులు పడటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల విక్రయాలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫెర్టిలైజర్ ఫీల్డ్ స్టాఫ్ (ఎఫ్‌ఎఫ్‌ఎస్) వ్యవస్థను మరో 10 జిల్లాలకు విస్తరించనున్నట్లు ప్రకటించింది. కేంద్రం ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థను నేటి నుంచి మరో 10 జిల్లాల్లో అమలు చేయనున్నారు. ఈ వ్యవస్థ ద్వారా ఆధార్‌తో ఎరువులు కొనుగోలు చేస్తున్నామని, దీని వల్ల బ్లాక్ మార్కెటింగ్‌కు నిరోధించవచ్చని తెలిపింది. అంతేకాకుండా ఎరువుల స్టాక్ ఎంత ఉందనేది రియల్ టైమ్‌లో సమాచారం తెలుసుకోవచ్చు. ఇవాళ అధికారులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆయిల్ ఫామ్ మొక్కలు వెంటనే రైతులకు అందించాలని ఆదేశించారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఇక డ్రిప్ ఏర్పాటుపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. యువ ఆవిష్కర్తలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఆయిల్ ఫామ్‌పై అవగాహన ఆయిల్ ఫామ్‌పై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రోత్సాహకాలు అందించనుంది. దీని ఉత్పత్తిలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో రాష్ట్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను తుమ్మల కోరారు. రాష్ట్రంలో ఎరువుల పంపిణీని వేగవంతంగా, పారదర్శకంగా చేపడుతున్నట్లు చెప్పారు. యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ యాప్ సేవలను విస్తరించినట్లు తెలిపారు.

## నీళ్లు.. నిధులు.. నియామకాలు!

-మొదటిపేజీ తరువాయి

నీటిపారుదల శాఖలో ఉన్న ఆంధ్రా అధికారులు అంటూ సెంటిమెంట్ అస్త్రం సంధించారు హరీష్‌రావు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో కీలక స్థానాల్లో ఉన్నవారంతా ఆంధ్రా మూలాలు ఉన్న వారేనంటూ ఓ లిస్ట్ బయటకు తీశారు. వాళ్లంతా తెలంగాణకు అన్యాయం చేస్తుంటే తెలంగాణ హక్కులను కాపాడాల్సిన అధికారులు, ఇంజినీర్లు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణలో తెలంగాణ కోసం పుట్టిన పార్టీలే అధికారంలో ఉండాలంటూ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేశారు మాజీ మంత్రి కేటీఆర్. ఇందుకు, నీళ్ల అంశాన్నే ఉపయోగించుకున్నారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అడగడాన్ని తప్పు పట్టారు.

## తెల్లరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారు

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. అర్హులైన పేదలకు 1.05 కోట్ల కొత్త రేషన్ కార్డులు అందిస్తామన్నారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి ఉత్తమ్ వివరించారు.

**1.05 కోట్ల కార్డుల పంపిణీ**

రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో 1.05 కోట్ల కార్డులను పంపిణీ చేస్తామని మంత్రి చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని ఉత్తమ్ వెల్లడించారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని చెప్పారు. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయిలో పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. లబ్ధిదారుల జాబితాల ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల్లో ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మరో కీలక మైలురాయిగా నిలుస్తుంది : పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తూ, ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను అర్హత పొందిన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం సంక్షేమ పాలనలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## పుంజుకున్న వరి సాగు

-మొదటిపేజీ తరువాయి

ఎకరాల్లో, చిరు ధాన్యాలు 5,27,080 ఎకరాల్లో సాగు పూర్తయ్యింది. ఇటీవలి వర్షాలు రాష్ట్రంలోని రైతులకు 'ఎల్?నినో' ప్రభావం నుంచి కొంత ఉపశమనాన్ని కలిగించాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పేర్కొంది. పంటల పరిస్థితిపై విశ్వవిద్యాలయం బుధవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి : జూన్‌లో సాధారణ వర్షపాతం 130.30 మి.మీ కాగా, 115 మి.మీ నమోదైంది. జులైలో సాధారణ వర్షపాతం 227.40 మి.మీ కాగా, 222.90 మి.మీ నమోదైంది. ఈ నెలలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 38.4 మి.మీ కాగా, 39.1 మి.మీ వర్షపాతం నమోదైంది. జనగామ, హనుమకొండ, వరంగల్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి, మెదక్, కామారెడ్డిలలో అధిక వర్షపాతం నమోదు కాగా, మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

ప్రాజెక్టులు నిండటంతో రైతుల్లో ఆశలు రుతుపవనాలు పుంజుకుని వర్షాలు పడటంతో మొన్నటివరకు వెలవెలబోయిన ప్రాజెక్టులు ప్రస్తుతం జలకళను సంతరించుకుంటు న్నాయి. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎల్?నినో ప్రభావంతో సాగుపై దిగులు చెందిన రైతన్నలు, ప్రస్తుతం పొలం పనులు వేగవంతం చేస్తున్నారు. కృష్ణా, గోదావరి నదులపై ఉన్న జలాశయాల్లో నీటి నిల్వలు 40 శాతాన్ని దాటాయి. 87 జలాశయాల్లో పూర్తి సామర్థ్యమైన 1059 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 40.89 శాతం మేర 433.15 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గోదావరి బేసిన్ జలాశయాల్లో 142 టీఎంసీలు, కృష్ణా బేసిన్ జలాశయాల్లో 290 టీఎంసీలకు పైగా నీరు ఉంది.

## వంటగ్యాస్ వినియోగదారులకు అలర్ట్
## ఆ తేదీలోగా ఈకేవైసీ చేయనట్లైతే
## సబ్సిడీ కోల్పోయే ఛాన్స్!

గ్యాస్ వినియోగదారులకు అలర్ట్. ఈ-కేవైసీ చేయించుకోకపోతే ఎల్పీజీ గ్యాస్ బుకింగ్ క్యాన్సిల్, సబ్సిడీ కోల్పోయే అవకాశం ఉండటంతో వినియోగదారులు డిస్ట్రిబ్యూటర్ కేంద్రాలు, గోదాముల వద్ద ప్రజలు క్యూ కడుతున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేసి, అర్హులైన కుటుంబాలకు ఎల్పీజీ వంట గ్యాస్ సరఫరా చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ-కేవైసీ తప్పనిసరి చేసింది. దేశంలో ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే ఇచ్చిన గడువు పూర్తవడంతో మళ్లీ ఈ నెల 16వ తేదీ లోగా బయోమెట్రిక్ పూర్తి చేయాలని ఆయిల్ కంపెనీలు నిర్ణయించాయి.

**అప్పటిలోగా ఈకేవైసీ చేయాల్సిందే**

వంట గ్యాస్ వినియోగదారులకు ఈ-కేవైసీ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ బయోమెట్రిక్ లేని వినియోగదారుల ఆన్లైన్ బుకింగ్స్ ఆగస్టు 1వ తేదీ నుంచే ఆటోమేటిక్‌గా క్యాన్సిల్ అవుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ చేయించుకోవడం తప్పనిసరి చేయడంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి ఇంధన కంపెనీలు రంగంలోకి దిగి చర్యలు వేగవంతం చేశాయి. అన్ని రాష్ట్రాల్లో దీర్ఘకాలంగా బోగస్ ఎల్పీజీ కనెక్షన్లు, అనర్హుల పేరిట ఉన్న కనెక్షన్లు, ఒకే కుటుంబంలో రెండు మూడు కనెక్షన్లు ఉండటంతో అందుకు కోసం ఇచ్చే రాయితీ భారం కేంద్రంపై పడుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరకపోవడంతోపాటు ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు బ్లాక్ మార్కెట్లో దారిమళ్లుతున్నాయి.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
7 ఆగస్టు 2026

## సంపాదకీయం

# రిజర్వేషన్లు లేని సమాజం సాధ్యమా..

కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు ఆ ప్రశ్న సరైనదేనా అని అడగాలి ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రతి చర్చ ఒకే విధంగా పుట్టదు. కొన్ని చర్చలు సమాజం అవసరం వల్ల వస్తాయి. మరికొన్ని రాజకీయాల అవసరం వల్ల వస్తాయి. ఈ రెండింటి మధ్య తేడా గుర్తించకపోతే సమాధానం ఎంత సరైనదైనా అది అసలు ప్రశ్ననుంచి తప్పించుకోవచ్చు. రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చ కూడా అలాంటిదే. పైకి చూస్తే అది ఒక విధానం గురించి చర్చలా కనిపిస్తుంది. కానీ కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. అదే 'సామాజిక న్యాయం పూర్తయిందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలియకుండా దాన్ని సాధించే విధానాలపై తీర్పు చెప్పడం అంటే గమ్యానికి చేరామో లేదో చూడకుండానే ప్రయాణాన్ని ఆపేయాలని నిర్ణయించడం లాంటిది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టుగా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. అసంపూర్ణమంటే విఫలం అని కాదు. ఇంకా పూర్తి చేయాల్సిన బాధ్యత మిగిలి ఉందని అర్థం. ప్రతి అసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు. కానీ చరిత్రను రద్దు చేయలేదు. ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. అందుకే శతాబ్దాలుగా అవకాశాలకు దూరమైన వర్గాలకు ఇప్పటినుంచి అందరూ సమానం అని చెప్పడం న్యాయం కాదని వారు అర్థం చేసుకున్నారు అందుకే సమానత్వాన్నీ కేవలం హక్కుల భాషలోనే కాదు అవకాశాల భాషలో కూడా నిర్వచించారు. రిజర్వేషన్లు ఆ తర్కం నుంచే పుట్టాయి. అవి ప్రత్యేక హక్కులు కాదు. చరిత్ర మూసివేసిన తలుపులను ప్రజాస్వామ్యం మళ్లీ తిరిగి రాయడానికి నిర్మించిన రాజ్యాంగబద్ధ వంతెన. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. అమెరికా బానిసత్వం తర్వాత, దక్షిణాఫ్రికా అపార్థెయిడ్ తర్వాత, బ్రెజిల్ వర్ణ అసమానతల నేపథ్యంలో, కెనడా స్థానిక ప్రజల హక్కుల విషయంలో, న్యూజిలాండ్ మావోరీ ప్రజల రాజకీయ ప్రాతినిధ్యంలో. రూపాలు,పేర్లు వేరు కావచ్చు. కానీ ప్రతి సమాజం ఒకే సత్యాన్ని ఎదుర్కొంది. చరిత్ర సృష్టించిన అసమానతులను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అందరికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగించదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమానత్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. కానీ మెరిట్ అనేది అవకాశాల నుంచి వేరు చేసుకోగలిగే గుణం అయితే సమాజం ఎప్పుడో న్యాయబద్ధమై ఉండేది.నిజానికి మెరిట్ కూడా ఒక సామాజిక నిర్మాణమే. ఒక పిల్లవాడు ఏ పాఠశాలలో చదివాడు, ఇంట్లో చదివే గది ఉందా, తల్లిదండ్రుల విద్యా స్థాయి ఏంటి, అతను ఆకలితో పాఠశాలకు వెళ్లాడా లేక ఆత్మవిశ్వాసంతో వెళ్ళాడా, కులం కారణంగా అవమానాన్ని ఎదుర్కొన్నాడా లేదా ఇవన్నీ అతని సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రతిభను మాత్రమే చూసి మెరిట్‌ను కొలవడం అంటే అవకాశాలను కనిపించినట్లు నటించడం; అసమాన ప్రారంభ రేఖలతో పందెం పెట్టి గెలిచిన వారిని ప్రతిభావంతులని ప్రకటించినట్టే. ప్రపంచానికి మరో నైతిక కొలమానం ప్రాతినిధ్యం; ప్రాతినిధ్యం రాజకీయ నినాదం కాదు. ప్రజాస్వామ్య నైతికత. న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో, శాసనసభల్లో, పరిపాలన వ్యవస్థలో, సమాజంలోని అన్నివర్గాలు కనిపించాలి. ఎందుకంటే రాష్ట్రం కేవలం అధికారం నిర్మాణం కాదు. సమాజం తననుతాను చూసుకునే అద్దం. ఆ అద్దంలో కొన్ని వర్గాలు మాత్రమే కనిపిస్తే మిగిలినవారికి ప్రజాస్వామ్యం ఒక వాగ్దానంగా మిగులుతుంది. అనుభవంగా మారదు. అందుకే ప్రాతినిధ్యం అనేది రాజకీయ రాయితీకాదు. ప్రజాస్వామ్య నాణ్యతకు అవసరమైన షరతు. అయితే రిజర్వేషన్ల గురించి ఏ నిర్ణయానికైనా రాకముందు ఆ షరతు నిజంగా నెరవేరిందా అనే కనీస ప్రాథమిక ప్రశ్నలనైనా మనకు మనమే వేసుకోవాలి. అది కులం మనిషి అవకాశాలను, ఆత్మగౌరవాన్ని, జీవిత గమనాన్ని, ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని ధైర్యంగా ప్రకటించగలమా? పుట్టుక కాదు ప్రతిభ మాత్రమే ప్రతి వ్యక్తి భవిష్యత్తును నిర్ణయిస్తుందని నిస్సందేహంగా చెప్పగలమా? మొత్తానికి సామాజిక న్యాయం పూర్తయిందని నిజంగా చెప్పగలమా? ఈ ప్రశ్నలు దీనికైనా నిజాయితీగా 'అవును' అని చెప్పగలిగితేనే రిజర్వేషన్ల అవసరం ముగిసింది అని చెప్పవచ్చు. లేకపోతే సమస్య ఇంకా కొనసాగుతుండగానే పరిష్కారం పూర్తయిందని ప్రకటించినట్లు అవుతుంది. ఇలాంటి సమయంలోనే రిజర్వేషన్లపై చర్చ మళ్ళీ రాజకీయ కేంద్రంగా మారడం గమనించదగిన విషయం.రిజర్వేషన్లపట్ల విముఖతను వ్యక్తం చేస్తూ వచ్చిన బిజెపి రాజకీయ సైద్ధాంతిక వైఖరి నేపథ్యంలో ఈ చర్చను విశ్లేషించడం సహజమే. అయితే రాజకీయ ఉద్దేశం ఏదైనా కావచ్చు. కానీ సమాజం అడగాల్సిన ప్రశ్న మాత్రం వేరే. 'రిజర్వేషన్ల స్థానంలో సామాజిక న్యాయాన్ని మరింత సమర్థంగా సాధించే వ్యవస్థ ఏమిటి'? ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు స్పష్టంగా వినిపించలేదు. ఎందుకంటే ప్రత్యామ్నయం అనేది ఒక నినాదం కాదు. ఒక సామాజిక నిర్మాణం. కులం అవకాశాలను నిర్ణయించనీ సమాజం. అందరికీ సమాన నాణ్యతతో కూడిన విద్య. భూమి వంటి ఉత్పాదక వనరులపై న్యాయమైన ప్రాప్యత. వివక్ష లేని ఉపాధి. సంపదలో తీవ్రమైన అసమానతలు తగ్గిన ఆర్థిక వ్యవస్థ. అన్ని వర్గాలకు సహజమైన ప్రాతినిధ్యం. ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే రిజర్వేషన్లు అవసరం సహజంగానే తగ్గుతుంది. కానీ ఈ పరిస్థితులను సృష్టించకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా, వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామాజిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం. కానీ ఆ సమాజాన్ని నిర్మించే దిశగా మనం నిజంగా ప్రయాణిస్తున్నామా? లేక రిజర్వేషన్లనే ప్రశ్నిస్తూ వాటిని అనివార్యం చేసిన సామాజిక నిర్మాణాన్ని యథాతథంగా కొనసాగిస్తున్నామా? భారత ప్రజాస్వామ్యం చివరికి సమాధానం చెప్పాల్సింది ఈ ప్రశ్నకే.

# యువ బొద్దింకలకు మరో లేఖ

జీవితంలో వైఫల్యాలు అందరికీ ఉంటాయి. పెద్దదో, చిన్నదో అవి ఎదుర్కొంటారు. కానీ ఒక అఖండ విజయాన్ని పొందినప్పుడే సంయమనం అవసరం. జంతర్ మంతర్‌లో యువ బొద్దింకలది ఒక రకంగా అఖండ విజయమే. గత 12 ఏండ్ల నుంచి వ్యవస్థలను, వార్తా మాధ్యమాలను చేజిక్కించుకుని ప్రజలతో, వారి సంక్షేమంతో సంబంధం లేకుండా పరస్పర సంబంధాలు తుడిచేసి, ఏకాంకిక (ఏకపాత్రాభినయంలా) కేంద్రం పరిపాలన చేస్తున్న సమయంలో ప్రజల వ్యతిరేకతను ఇంత బాగా చూపించిన ఘనత మన వారసులదే! అయితే పైకి ఇది 'కంస సంహారం'లాగా కనిపించినా ఇక్కడ వైరిబలం తెలుసుకోవటం చాలా ముఖ్యం. జంతర్ మంతర్ వద్ద ఉద్యమించిన కాక్రోచ్ పార్టీ ఆందోళనకారులపై పోలీసులు విరుచుకుపడ్డారు. మేకులు బిగించిన లాఠీలతో దాడి చేశారు. అక్కడ మోహరించిన బీజేపీ అనుకూల గుంపులు, గూండాలు నిరసనకారులను చితకబాదారు. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో పెద్దఎత్తున కనిపించాయి. పశుబలంతో, భయభ్రాంతులను చేసి, ప్రజలను పీడించిన వాళ్లు దేశభక్తులా? వీరి నాయకుడు విశ్వగురువా? మణిపూర్ మారణహోమం, క్రీడాకారిణులు చేసిన నిరసన ఎట్లా ముగిసింది? ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్‌కు పదవులు, అధికారం, సత్కారాలా? పూర్తి ఏడాదిపాటు రోడ్ల మీదే బతికి వ్యవసాయ నల్ల చట్టాలు వద్దని నిరసన తెలిపిన అన్నదాతలను బీజేపీ ఎట్లా పీడించింది? అన్నం తినేటప్పుడైనా రైతు విలువ గుర్తురావాలి కదా! ఇవన్నీ పైకి కనిపించిన ఘటనలు. చాపకింద నీరులా దేశ సంపద సంపన్నుల వైపు ప్రవహిస్తుంటే, నిరసన తెలిపేవారి గతి రోజూ చూస్తున్నాం. ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అరాచకాలను ఏ స్థాయి వరకూ తీసుకెళ్తున్నదో అర్థం చేసుకోవడానికి. అందుకే ప్రస్తుతం ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలుస్తున్న యువతకు వైరిబలం, వారి ప్రవర్తన అర్థం చేసుకోవడం చాలా అవసరం. యువత ఒక విషయం జాగ్రత్తగా గమనించాలి. ఏ ఉద్యమంలోనైనా ఒకే రకమైన ప్రణాళిక పాటించడం శ్రేయస్కరం కాదు. కష్టనష్టాలకోర్చి మొన్నటి నిరసనలాంటిది మళ్లీ చేస్తే దానిని చూడటం ప్రజలకు అలవాటయిపోతుంది.



ఏదైనా అలవాటయిపోయిన దాన్ని ప్రజలు పట్టించుకోరు. కాబట్టి జెన్-జీ సమయం, ధనం వెచ్చించాల్సింది కేంద్రానికి బలమున్న ఢిల్లీలో కాదు. ఎవరి రాష్ట్రంలో వారు ఆ రాష్ట్ర ప్రభుత్వ అపాలనను ఎండగట్టాలి. అన్ని ఆన్‌లైన్ వేదికల మీద కూడా చర్చించుకోవచ్చు. రాష్ట్ర రాజధానులు, వివిధ నగరాల్లోనూఆందోళన కార్యక్రమాలు సాగించాలని యువతకు సూచన. ముఖ్యంగా అక్కడి సామాన్య ప్రజలను చైతన్యపర్చండి.

ఇంకా ముఖ్యమైన విషయం. మీ రాష్ట్రంలో ఉన్నత విద్యావంతులు ప్రభుత్వంలో రిటైరైనవారు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, డాక్టర్లు, లాయర్లు, ఇంకెవరైనా రాజకీయ అవగాహన ఉండి, ప్రజాహితం కోరే ఒక పదిమంది పెద్దవయసు వారిని మీ గ్రూపులకు ప్రత్యేక అతిథులుగా నియమించుకోండి. ఎందుకంటే, ఏ ఉద్యమానికైనా మీకున్న శక్తి, చైతన్యం, ఉత్సాహం, ధైర్యం ఎంత ముఖ్యమో, పెద్ద వయసువారికున్న జీవితానుభవం, రాజకీయ అవగాహన, పూర్వచరిత్ర జ్ఞానం, సంయమనం, సంతులత అంతే అవసరం. అయితే ముఖ్యంగా అందరూ పాటించవలసినది పరస్పర గౌరవం, అభిమానం, సమానత. అప్పుడు అది నిజమైన ప్రజాస్వామ్య సంస్థ అవుతుంది. ఎవరికి వారు తమ రాష్ట్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయండి. ప్రతీ రాష్ట్రంలో తప్పక జరిగేటట్టు చూడండి.

ఇప్పుడు మీ ముందున్నది ఒక్క అంశం కాదు. ప్రతీ రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, చర్యలను ఎండగట్టండి. ముఖ్యమైన రంగాలు విద్య, వైద్య, వ్యవసాయ, ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాల గురించి క్షుణ్ణంగా అర్థం చేసుకోండి. వీలైనంత వరకు కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలను విసర్జించండి. దేశంలో అన్ని రాష్ట్రాల్లో అలజడి వస్తే అన్నింటినీ నియంత్రించటం కేంద్రానికి కష్టమవుతుంది. ప్రభుత్వాలను, పార్టీలను దేశమంతా వ్యతిరేకిస్తున్నట్టు ఇతర దేశాలకు తెలుస్తుందనే భయముంటుంది. ఈ నిరసన కార్యక్రమాలు అంతర్జాతీయ పత్రికల్లో రిపోర్టు చేయండి. ఎనభై ఏండ్ల అవినీతి పాలనలో ఈ దేశానికి ఈ గతి పట్టించిన రెండు జాతీయ పార్టీలను దగ్గరకు రానియ్యవద్దు. అక్కడ నాయకులు లేరు, అవినీతి మార్గంలో లక్షల కోట్ల రూపాయలు వెనుకేసుకున్నవాళ్లు తప్ప.

ఈ చివరి విషయం అతి ముఖ్యమైనది. ముఖ్యంగా యువత పోరాడవలసినది భవిష్యత్తుకు సంబంధించినది. విదేశీయులు, ముఖ్యంగా మొఘల్ రాజులు, బ్రిటిష్ వారు పాలించినప్పుడే భారతదేశం ఒక దేశమయింది. రామాయణ, భారత కాలం నుంచీ ఆర్యావర్తమంతా చిన్న చిన్న దేశాలుగా వివిధ వంశాల రాజులతో పాలనలో ఉన్నాయి. అందుకే యూరప్ ఖండంలో వివిధ దేశాలలాగా భాషలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, అన్నీ వైవిధ్యం కలిగి ఉంటాయి.

ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే విశ్వగురు ఈ దేశానికి పనికిరాని సిద్ధాంతాలు. అమెరికా లాగ ఏ రాష్ట్ర పరిస్థితిని బట్టి ఆ రాష్ట్ర వ్యవహారాలు ఉండాలి. రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ, స్వతంత్ర ప్రతిపత్తి ఉండాలి.

రాష్ట్రాల ఆదాయంలో కేవలం 10 శాతం మాత్రమే కేంద్రానికి పంపి, ఏ రాష్ట్ర అభివృద్ధి ఆ రాష్ట్రమే చూసుకోవాలి. సైన్యం గురించి, రాష్ట్రాల మధ్య ఏవైనా సమస్యలు వస్తే అవి మాత్రం కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవాలి. ఒక్క నీట్ పేపర్ మాత్రమే కాదు, డిగ్రీ వరకు విద్యారంగం కేవలం రాష్ట్రం చేతుల్లోనే ఉండాలి. రాష్ట్రాలు ఒక సంయుక్త సమాఖ్య (ఫెడరల్) లాగ ఉండాలి. వైవిధ్యభరితమైన ఇటువంటి దేశానికి ఏకీకరణ కాదు, వికేంద్రీకరణ కావాలి. యువత దీనికోసం ఉద్యమం చేసి సాధించాలి. మీ ప్రయత్నాలన్నింటికీ మా తరం మద్దతు, ఆశీర్వచనాలు ఇస్తుంది. విజయోస్తు.

# హసీనా అప్పగింత సాధ్యమా?

రెండేళ్ల క్రితం ఉవ్వెత్తున ఎగిసిపడిన విద్యార్థి ఉద్యమాన్ని అదుపుచేయటం అసాధ్యమని తేలాక హెలికాప్టర్‌లో అక్కడినుంచి నిష్క్రమించి భారత్‌లో ఆశ్రయం పొందిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా సరిగ్గా ఆ తేదీనే ఎంచుకుని తొలిసారి బుధవారం మీడియాతో మాట్లాడారు. వచ్చే డిసెంబర్‌లో స్వదేశానికి వెళ్లబోతున్నానని గతంలో చెప్పిన మాటనే పునరుద్ఘాటించారు. తనను జైల్లో బంధిస్తారని తెలిసినా, ఉరికంబం తన కోసం ఎదురు చూస్తున్నదని అర్థమైనా తిరిగి వెళ్లటానికే ఆమె సంసిద్ధులవుతున్నారు. దేశానికి సారథ్యంవహించే నాయకత్వానికి పరిణతి లోపిస్తే కక్ష సాధింపులే సమర్థతగా అనిపిస్తాయి.



సాధించిన స్వాతంత్ర్యం అర్థరహితమవుతుంది. ఇది బంగ్లాదేశ్ ప్రస్తుత నాయకత్వానికి మాత్రమే కాదు... హసీనాతోసహా బంగ్లా మాజీ పాలకులందరికీ వర్తిస్తుంది. ఆ మాట కొస్తే పాకిస్తాన్ పరిస్థితి కూడా మొదటినుంచీ ఇంతే. అదృష్టవశాత్తూ మన దేశంలో స్వాతంత్ర్యోద్యమ నాయకత్వం నుంచి తొలి తరం సారథులు రావటంవల్ల కావొచ్చు...ఆ బెడద లేదు. ఇక్కడ సైతం ఆ పోకడలు తలెత్తుతూనే ఉన్నా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తమై వాటిని తిప్పికొడుతూనే ఉన్నారు. బంగ్లాదేశ్‌లో తనకెదురైన దుఃస్థితికి హసీనా తనను తానే నిందించుకోవాలి. ప్రజలు మెచ్చి అధికారం కట్టబెట్టాక ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దారు. జీడీపీ పెరిగింది. అంతక్రితంతో పోలిస్తే ఉపాధి అవకాశాలు విస్తృతమయ్యాయి. కానీ ఆ అధికారాన్ని శాశ్వతం చేసుకోవటానికి ఆమె వేసిన ఎత్తుగడలు అవధులు మీరాయి. వస్తున్న మెజారిటీ చాలదనుకుని ఎన్నికల ఫలితాలు ఏమార్చారు. చివరకు మొత్తం ఎన్నికలే రిగ్గింగ్ చేసే స్థాయికి దిగజారారు. మతోన్మాద శక్తుల ఆటకట్టించేందుకు చర్యలు తీసుకున్నా, సహేతుకమైన అసమ్మతికి సైతం ముద్రలేసి పబ్బం గడుపుకోవాలనుకున్నారు. మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) అధినేత బేగం ఖలీదా జియాను అవినీతి ఆరోపణలతో దీర్ఘకాలం చెరసాలపాలు చేశారు. ఖలీదా సైతం అంతే. తాను రాజ్యమేలిన మూడు దఫాలూ కక్షసాధింపు రాజకీయాల్లోనే మునిగితేలారు. ఆమె కుమారుడు, ప్రస్తుత ప్రధాని తారిఖ్ రెహ్మాన్ ఆ వారసత్వాన్నే కొనసాగించదల్చుకున్నట్టు కనబడుతోంది. హసీనా సర్కార్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పోలీసులు, సైన్యం జరిపిన కాల్పుల్లో 1,400 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి లెక్కలే చెబుతున్నాయి. నిజమే కావొచ్చు. జరిగిన తప్పిదాలకు ఆమె బాధ్యత వహించాల్సిందే. కానీ న్యాయవ్యవస్థను మహ్మద్ యూనస్ సలహాదారుగా ఉన్న తాత్కాలిక ప్రభుత్వం భ్రష్టుపట్టించింది. మతతత్వవాదులు రెచ్చిపోయి హసీనా ఏలుబడిలోని న్యాయమూర్తుల్ని వేధించి రాజీనామాలు చేయించారు. ఉన్నతాధికారుల్ని అరెస్టు చేశారు. హిందూ మైనారిటీల ఇళ్లపై దాడులకు దిగారు. ఇలాంటి వాతావరణంలో జరిగిన విచారణకు విశ్వసనీయత ఉంటుందా? హసీనాను అప్పగించటంలేదన్న ఆగ్రహం బంగ్లాకు ఉంది. ఇదేమీ అసహజం కాదు. కానీ అధికారంలోకొచ్చాక భారత్‌ను రెచ్చగొట్టేలా తారిఖ్ రెహ్మాన్ చర్యలుంటున్నాయి. జూన్‌లో చైనాలో నాలుగు రోజులు పర్యటించి, 17 ఒప్పందాలు కుదుర్చుకున్నారు. '2ం2 డైలాగ్' పేరిట విదేశాంగ విధానాన్నీ, భద్రతనూ నిర్ణీత వ్యవధిలో చర్చించుకుంటూ ఉండాలని రెండు దేశాలూ నిర్ణయించుకున్నాయి. అమెరికాతో ఆయన సాన్నిహిత్యం తెలియందేమీ కాదు. బంగ్లాలో అలజడుల వెనక అమెరికా పాత్ర జగద్విదితం. ఇదిగాక భారత్‌కు సన్నిహితమైతే విపక్షమైన జమాతే ఇస్లామీ బలపడుతుందేమోనన్న భయంతో రెహ్మాన్ మనవైపు కన్నెత్తి చూడటానికే సాహసించటం లేదు. ఇలాంటి స్థితిలో హసీనాను భారత్ అప్పగిస్తుందని ఆ దేశం అనుకోవటం హాస్యాస్పదం. అందరి మాదిరే మన దేశం ఎటూ స్వీయప్రయోజనాలు చూసుకుంటుంది. దౌత్యరంగంలో ఎప్పుడూ పరిస్థితులు ఒకేలా ఉండవు. బంగ్లా చిత్తశుద్ధితో వ్యవహరిస్తే, ఇంటా బయటా భారత వ్యతిరేక శక్తులతో చేతులు కలిపే అత్యుత్సాహాన్ని ఆపుకుంటే ఏ సమస్య అయినా తప్పక పరిష్కారమవుతుంది. అంతకన్నా ముందు హసీనా కుమారుడు ఈ మీడియా సదస్సులో ఆరోపించినట్టు బంగ్లా మరో పాకిస్తాన్‌గా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత రెహ్మాన్‌కుంది.

## మయిన్మార్‌తో భారత్ స్మూత్ డీల్

మయన్మార్ సరిహద్దుల్లో దశాబ్దాలుగా గుర్తించని వివాదాస్పద ప్రాంతాల పరిష్కారం కోసం భారత్ భూభాగ మార్పిడి ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. "సరిహద్దులో ఇంకా పరిష్కరించని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి... ఆయా అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి" అని తెలిపారు. మణిపూర్ సరిహద్దుల వెంబడి మయన్మార్‌తో భూ మార్పిడికి భారత్ సిద్ధమవుతోందన్న నివేదికలపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు వివాదాలను పరిష్కరించడానికి చర్చలు జరుగుతున్నాయనే ఈ నివేదికలను ఆయన పరోక్షంగా అంగీకరించారు.దీనిపై అమెరికాకు చెందిన 'ది డిప్లొమాట్' పత్రిక కొద్ది వారాల కిందట కథనం ప్రచురించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మణిపూర్-మాయన్మార్ సరిహద్దులోని పిల్లర్ 65 నుంచి 68 మధ్య ఉన్న సుమారు 2.8 కిలోమీటర్ల పరిధిలోని 1.4 చదరపు మైళ్ల భూభాగాన్ని మార్పిడి చేసుకోవడం ద్వారా సరిహద్దు గుర్తించే ప్రక్రియను పూర్తి చేయాలని భారత ప్రభుత్వం ఒక ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు అధికారిక పత్రాలను ఉటంకిస్తూ జులై 17న సదరు పత్రిక నివేదించింది. భూ మార్పిడి కోసం ప్రతిపాదించిన ప్రాంతం మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో, మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతంలో ఉన్న కబావ్ లోయకు ఆనుకొని ఉంది. మే 26, 2026 నాటి అధికారిక పత్రం ప్రకారం, సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియ మూడు నెలల్లో అంటే సుమారుగా ఆగస్టు నాటికి పూర్తి కావాల్సి ఉంది.భారత్, మయన్మార్‌లు అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం గుండా మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతం, చిన్ రాష్ట్రాల్లోకి ప్రవేశించే 1,643 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటున్నాయి. ఈ సరిహద్దులో మెజార్టీ ప్రాంతం కొండలు, అడవులతో నిండి ఉండి చొరబాట్లకు అనుకూలంగా ఉంటుంది. ఇరువైపులా చారిత్రాత్మకంగా ఒకే వర్గానికి చెందిన గిరిజన జాతులు నివాసం ఉంటున్నారు. కేంద్ర హోం శాఖ ప్రకారం.. పిల్లర్ల ద్వారా సుమారు 1,472 కిలోమీటర్ల సరిహద్దును నిర్ధారించారు. అయితే, ప్రధానంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని లోహిత్ సెక్టార్, మణిపూర్‌లోని కబావ్ లోయలో దాదాపు 171 కిలోమీటర్ల సరిహద్దు ఇంకా పరిష్కారం కాలేదు.'ది డిప్లొమాట్' ప్రకారం.. భారత్-మయన్మార్ సరిహద్దులో ఇంకా అపరిష్కృతంగా ఉన్న ప్రాంతంలో గుర్తింపు నిర్ధారణను వేగవంతం చేయడమే భూభాగ మార్పిడి వెనుక ఉద్దేశం. దీనివల్ల సరిహద్దు పొడవునా కంచె నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోతాయి. తత్ఫలితంగా అక్రమ వలసలు, తిరుగుబాటుదారుల కదలికలు, ఇతర సరిహద్దు నేరాలను అరికట్టడానికి వీలు కలుగుతుంది.మయన్మార్ వెంబడి 1,643 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దు కంచె ప్రణాళికను 2024లో భారత్ ప్రకటించింది. అదే సమయంలో 2018 నుంచి అమల్లో ఉన్న భారత్-మయన్మార్ సరిహద్దు స్వేచ్ఛా రాకపోకల విధానాన్ని కూడా రద్దు చేసింది. ఈ విధానం ప్రకారం.. సరిహద్దు సమీపంలో నివసించే గిరిజన వర్గాలు, బోర్డర్ పాస్ ఉపయోగించి వీసా లేకుండా ఒకరి భూభాగంలోకి మరొకరు 16 కిలోమీటర్ల వరకు ప్రయాణించడానికి అనుమతి ఉండేది.ప్రస్తుత భారత్-మయన్మార్ సరిహద్దును 1967 ద్వైపాక్షిక ఒప్పందం కింద నిర్వచించారు. కానీ దానిలోని కొన్ని భాగాలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. అపరిష్కృత ప్రాంతాలను ద్వైపాక్షిక సరిహద్దు యంత్రాంగం ద్వారా నిర్ధారిస్తామని, ఇందులో భాగంగా తొమ్మిది పిల్లర్లు గుర్తించి, ఏర్పాటు చేస్తామని 2018లో పార్లమెంట్‌కు కేంద్రం తెలిపింది.

# తెలంగాణ బానిస, వలస విముక్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్

**రాయికల్, ఆగస్టు6,(నవగీతం)** ఆంధ్ర పాలకుల పాలనలో తెలంగాణ ఎదుర్కొన్న బానిసత్వం, వలస విధానాల నుంచి విముక్తి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ అని ఇటిక్యాల గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్ అన్నారు. గురువారం జయశంకర్ సార్ జయంతిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ నీరటి శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణకు నిధులు,నియామకాలు, ఉద్యోగాలు,నీటి వనరుల విషయంలో జరిగిన అన్యాయాన్ని దేశానికి తెలియజేస్తూ,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ తన జీవితాన్నే అంకితం చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ధ్యాన గురువులు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీరటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యానాన్ని ఆచరిస్తూ రోజుకు సుమారు మూడు గంటలే నిద్రపోయినా దేశరక్షణ, అభివృద్ధే ధ్యేయంగా దేశసేవలో నిరంతరం నిమగ్నమై పని చేస్తున్నారని,డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్



ఆశయాల సాధనకు మోదీజీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.జిల్లా ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి,గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ జాతీయవాది అనుపురం లింబాద్రి గౌడ్,మాట్లాడుతూ, ధ్యానం శారీరక,మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, చదువులో ఏకాగ్రత కలుగుతుందని, విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో ధ్యానాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి,వి.డి.సి. చైర్మన్ జాతీయవాది అనుపురం లింబాద్రి గౌడ్, మాజీ సర్పంచ్ సామల్ల లావణ్య--వేణు, లయన్స్ క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తోట రాజేష్, రాంరెడ్డి, ధ్యాన గురువులు తులసి నర్సయ్య, లత, మమత, తేజశ్విని, సుమలత, రాజశ్రీ, పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, గాజెంగి రాజేశం, హన్మంతరావు, ఎద్దండి రమేష్, జియావుద్దీన్, ముజాహిద్, నీరజ, సమత, రాజం తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం--వాజేడు రహదారిపై స్పందించిన మంత్రి తుమ్మల.

## ఏపీ ఆర్అండ్‌బీ మంత్రికి తుమ్మల విజ్ఞప్తి.

ములుగు,ఆగష్టు 07,(నవగీతం) .భద్రాచలం నుంచి వాజేడు వరకు ఉన్న(ఎస్ హెచ్ 12 స్టేట్ హైవే)అధ్వాన్నంగా మారిన రహదారికి తక్షణమే మోక్షం కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రోడ్లు--భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని కోరారు. బుధవారం ఈ మార్గంలో ప్రయాణించిన సందర్భంగా రహదారి దుస్థితిని చూసిన స్థానికులు మంత్రిని అడ్డుకుని తమ సమస్యలను వివరించారు. గతంలో తుమ్మల ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడు ఈ రహదారి నిర్మాణం జరిగిందని, అనంతరం ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 100 కిలోమీటర్ల ప్రయాణానికే మూడు గంటల సమయం పడుతోందని, ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు తెలిపారు. ప్రజల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి, సంబంధిత అధికారులకు, తెలంగాణ ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. రహదారి మరమ్మతులు, అభివృద్ధి పనులను అత్యవసరంగా ప్రారంభించి ప్రజల కష్టాలకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తుమ్మల స్థానికులకు హామీ ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ,



రహదారి అభివృద్ధి పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం ఆందోళనకరమని మంత్రి జనార్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారం రోజుల్లోగా పనులు ప్రారంభం కాకపోతే ప్రస్తుత కాంట్రాక్టర్‌ను తొలగించి, కొత్త టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేయాలని కోరారు. దీనిపై మంత్రి జనార్ధన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భద్రాచలం--వాజేడు రహదారి అభివృద్ధి పనులు మొత్తం మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. భద్రాచలం నుంచి ఏటపాక వరకు ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 7.8 కిలోమీటర్ల రహదారిని రూ.3.70 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఏటపాక నుంచి చర్ల మండలంలోని సుబ్బంపేట వరకు 56.8 కిలోమీటర్ల మేర భద్రాద్రి డివిజన్ పరిధిలో రూ.67.58 కోట్లతో పనులు చేపట్టనున్నారు. సుబ్బంపేట నుంచి వాజేడు వరకు ములుగు డివిజన్ పరిధిలోని 48 కిలోమీటర్ల రహదారిని రూ.44 కోట్లతో నిర్మించనున్నారు. మొత్తం 112.6 కిలోమీటర్ల పొడవున సుమారు రూ.115.28 కోట్ల వ్యయంతో ఈ రహదారి అభివృద్ధి కానుంది.

ఈ పనులను ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, తెలంగాణ చీఫ్ ఇంజినీర్ బీవీ రావు పర్యవేక్షించనుండగా, భద్రాచలం, ములుగు ఈఈలు క్షేత్రస్థాయిలో అమలును పర్యవేక్షించనున్నారు. ముఖ్యంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు ఈ రహదారి దుస్థితి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల అధికారులను కోరారు.

# తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు.

## ములుగులో కలెక్టర్ కార్యాలయంలో ఘన నివాళులు అర్పించిన కలెక్టర్.

**ములుగు,ఆగష్టు 07 (నవగీతం)**ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త. స్వరాష్ట్ర సాధనలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయం అని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ జీవిత చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను స్క్రీన్ ద్వారా ఉన్నతాధికారులు ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన కృషి, రాసిన వ్యాసాలు, ఇచ్చిన ఉపన్యాసాలను అందరూ తిలకించారు. అనంతరం ములుగు జిల్లా కలెక్టర్



మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆచార్య జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఆచార్య జయశంకర్ తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అపారమైన ప్రావీణ్యం ఉందని అన్నారు. విద్యార్థిగా,ఉపాధ్యాయుడిగా, రచయితగా, ఉద్యమకారుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.

స్వరాష్ట్ర సాధన కోసం ఆయన తన జీవితాన్నే అంకితం చేశారనీ,రాష్ట్ర అభివృద్ధి కోసం, సాగునీటి ప్రాజెక్టుల కోసం, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఆయన రూపొందించిన ప్రణాళికలు నేటికీ మనకు మార్గదర్శకంగా ఉన్నాయి" అని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆచార్య జయశంకర్ ఆశయాలైన బంగారు తెలంగాణ సాధన కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆచార్య జయశంకర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.

# సర్ పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరాజు

**ములుగు,ఆగష్టు 07(నవగీతం)** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు. అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ములుగు నియోజకవర్గంలో 303 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో రెండు పోలింగ్ కేంద్రాలను స్థల మార్పు చేయనున్నట్లు, నాలుగు పోలింగ్ కేంద్రాల పేర్లను మార్చనున్నట్లు, మరో ఐదు నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.దీంతో నియోజకవర్గంలో మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అందుబాటులో ఉండనున్నాయని స్పష్టం చేశారు.ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల సంఖ్య, అందుబాటులో లేని ఓటర్ల వివరాలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తి సమాచారం అందించినట్లు తెలిపారు.ఎస్.ఐ.ఆర్-2026 ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు అందలేదని కలెక్టర్ తెలిపారు.



ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా అమలు చేస్తున్నామన్నారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, సలహాలను ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్.డి.ఓ కె. కృష్ణవేణి, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేరూరు పరిధిలో వ్యక్తికి విద్యుత్ షాక్.

## ధర్మారం సబ్ స్టేషన్ పరిధిలో ఘటన

**ములుగు,ఆగస్టు6,(నవగీతం)** ములుగు జిల్లా వాజేడు మండలం ధర్మారం సబ్ స్టేషన్ పరిధిలోని పేరూరు ఫీడర్‌లో రాంగ్ ఎల్‌సి (లైన్ క్లియరెన్స్) కారణంగా విద్యుత్ ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ఘటనలో సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అట్టం రాజబాబుకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.విద్యుత్ సరఫరా పనుల సమయంలో జరిగిన నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. పోల్ పై నుంచి కిందపడడంతో రాజబాబుకు తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదానికి గల పూర్తి కారణాలు, అధికారిక వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.



# పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్స్ పంపిణీ.



**ఇల్లంతకుంట, ఆగష్టు 6 (నవగీతం)** మండల కేంద్రంలో వర్షాకాలంలో పారిశుద్ధ్య సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు, విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కార్మికులకు సర్పంచ్ ఏం రాజు రెయిన్ కొట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతలో కార్మికుల సేవలు అత్యంత కీలకమైనవి అని అన్నారు. వర్షం, ఎండ, చలి వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజలకు నిరంతర సేవలందిస్తున్న కార్మికుల సంక్షేమానికి గ్రామపంచాయతీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విధులు నిర్వహించే కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని రెయిన్ కోట్స్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామస్తులు ఒగ్గు రమేష్, రాములు, సలీం, గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి.




**ఇల్లంతకుంట, ఆగష్టు 6 (నవగీతం)**మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఏం రాజు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం రాజు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఆజన్మాంతం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆచార్య జయశంకర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డు సభ్యులు రాకం సుమన్, నాయకులు ఒగ్గు రమేష్, ఎర్రోజు సంతోష్, అంగన్వాడీ టీచర్లు ఒగ్గు విజయ, బైరి అరుణ,కాసుపాక బాబాయి, మామిడి వందన గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బోర్నపల్లిలో కోతుల కలకలం గ్రామస్థుడిపై దాడి తీవ్ర గాయాలు

**రాయికల్ ఆగస్టు 06(నవగీతం)** రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామంలో కోతుల దాడి రోజురోజుకూ శ్రుతిమించుతోంది. గ్రామంలో గుంపులుగా తిరుగుతున్న కోతులు జనావాసాలపై పడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇంతకుముందు కూడా ఇదే పరిస్థితి ఎవరికి చెప్పుకున్నా ప్రయోగం లేకపోయింది తాజాగా గ్రామానికి చెందిన కుంటల లక్ష్మణ్, గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ , అతని పై కోతులు అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో అతనికి చేతి పైన తీవ్రమైన గాయాలవ్వడమే కాకుండా, వీపు భాగంలో కూడా గాయాలయ్యాయి.బాధితుడు ప్రస్తుతం స్థానిక ప్రాథమిక చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఇంట్లోంచి బయటకు రావాలంటేనే భయపడాల్సి వస్తోందని, నిత్యం బాటసారులు, చిన్నారులు, వృద్ధులపై కోతులు దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు, పంచాయతీ యంత్రాంగం స్పందించి, గ్రామంలో సైరిస్తున్న కోతులను వెంటనే పట్టుకుని అడవుల్లో వదిలేయాలని, గ్రామానికి భద్రత కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర మనుమయ సేవా సంఘం

**రాయికల్, ఆగస్టు 06 (నవగీతం)** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా రాయికల్‌లోని శ్రీ వెంకటేశ్వర మనుమయ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సంఘం సభ్యులు, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మానాల వెంకటి, ప్రధాన కార్యదర్శి కొమురోజు వెంకట రాములు, కోశాధికారి మానాల శ్రీహరి, సభ్యులు పిప్పోజీ మహేందర్ బాబు, గట్టిపెల్లి నరేష్ కుమార్, పాలిక రవీందర్, గద్దె రాజు, గొల్లపల్లి వెంకటరమణ, సుతారి కిషన్, చింతల అజయ్ కుమార్, మగ్గిడి మురళి, కొత్తపల్లి లింగమూర్తి, కిషన్, అంజయ్య, గన్నవరం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
7 ఆగస్టు 2026

# సమన్వయంతో యూనిఫామ్ పంపిణీ పూర్తి చేయాలి

**"అపార్" నమోదు వేగవంతం చేయాలి**

**95 శాతం విద్యార్థుల హాజరు ఉండాలి**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్,ఆగస్టు7,(నవగీతం)** సెర్ఫ్, విద్యా శాఖ ఉన్నతాధికారులతో డిఆర్డిఏ, మెప్మా, జిల్లా విద్యా శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల యూనిఫామ్ పంపిణీ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.విద్యాశాఖకు సంబంధించి వివిధ అంశాలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఆర్డిఏ, మెప్మా, విద్యా శాఖ సమన్వయంతో యూనిఫామ్ పంపిణీ పూర్తి చేయాలని, పంపిణీకి ముందు యూనిఫామ్ నాణ్యతను పరిశీలించాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలియజేసే "అపార్" నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆధార్ లో పొరపాట్ల వల్ల రిజిస్ట్రేషన్ ఆలస్యమైతే ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఆధార్ సరి చేయించాలని, ప్రధానోపాధ్యాయులు ఈ బాధ్యత తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, 95 శాతం విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను ఎంఈఓలు పరిశీలించాలని, అవసరమైన చోట వసతులు కల్పనకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. వర్షాల కారణంగా పాఠశాలలో ఇబ్బందులు లేకుండా చూడాలని, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం కావాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లో నిర్దేశిత లక్ష్యం నిండే వరకు విద్యార్థులను చేర్చుకోవాలని పేర్కొన్నారు. విద్యా శాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాధికారి చైతన్య జైని, ఏ.డి ప్రశాంత్ రెడ్డి, కో ఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఎమ్.ఈ.ఓలు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**విధిగా ప్రోటోకాల్ పాటించాలి**

**సతుల కల్పనలో ఇబ్బందులు రానీయొద్దు**

**కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్,ఆగస్టు6,(నవగీతం)** పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి , అదనపు డీసీపీ వెంకటరమణతో కలిసి వివిధ శాఖల అధికారులతో పంద్రాగస్టు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వేడుక సజావుగా సాగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రోటోకాల్ సమస్య తలెత్తకుండా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేదిక వద్ద సీటింగ్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. దేశభక్తి పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం కురిసినా ప్రోగ్రాం కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని.. ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. స్టాల్స్, శకటాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి వివిధ శాఖల పనితీరు తెలిసేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఆర్టీసీ, వైద్యశాఖ, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖల పనితీరు తెలిసేలా ప్రత్యేక స్టాల్స్ ,శకటాలు ఏర్పాటు చేయించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే రుణాలతో కూడిన స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో తయారుచేస్తున్న ఉత్పత్తులను ప్రదర్శించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల శకటం, డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలతో శకటం ఏర్పాటు చేయాలన్నారు. ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా తీసుకుంటున్న చర్యలతో స్టాల్ ఏర్పాటు చేయాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఫిషరీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు.
వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్, ఫైరింజన్ అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, పార్కింగ్ లో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశంసా పత్రాలు అందించేందుకు ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగులను ఎంపిక చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే అతిథులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలకు విద్యార్థులకు మీడియా కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అవసరమైన తాగునీరు, టెంట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలి అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**మల్లాపూర్,ఆగస్టు6,(నవగీతం)** తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్నంతా అంకితం చేసి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని, ఆయన జీవితమంతా తెలంగాణ ప్రజల హక్కుల సాధనకే అంకితమైందని కొనియాడారు. స్వార్థరహిత సేవ, నిబద్ధత, నిజాయితీతో ఉద్యమాన్ని ముందుకు నడిపిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. యువత జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మానాల కిట్టయ్య, తుమ్మనపల్లి శ్రీనివాస్, మానాల నాగయ్య, పోలాస రాజం, పోలాస మురళి, దొంతి రామాచారి, మద్దనపల్లి నారాయణ, మానాల శ్రీనివాస్, మానాల శ్రీనివాస్ రాజం, మానలా శంకరయ్య , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాట్ల సోమయ్య, నాయకులు సిరిపురం రవీందర్, భారతీయ జనతా పార్టీ నాయకులు ముద్దం సత్యనారాయణ గౌడ్, తెలంగాణ అంబేద్కర్ సంఘాల మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం కి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## చిన్నారులకు సామూహిక అన్నప్రాసన




**జగిత్యాల,ఆగస్టు6,(నవగీతం)** తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా జగిత్యాల పట్టణంలోని 6వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 6వ వార్డు కౌన్సిలర్ చీటి లక్ష్మీనారాయణ వార్డు అంగన్వాడీ టీచర్ హాజరై 6 నెలలు నిండిన చిన్నారులకు తొలిసారి అన్నం తినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఆరోగ్యవంతమైన పిల్లల కోసం తల్లిపాలతో పాటు 6 నెలల తర్వాత తప్పనిసరిగా అనుబంధ ఆహారం ప్రారంభించాలన్నారు. పిల్లలు పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలే ఉత్తమమైన ఆహారమని పిల్లలకు రెండు సంవత్సరాల వరకు పాలు ఇవ్వవచ్చని చెప్పారు. చిన్నారుల బరువు, ఎత్తు నమోదు చేసి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, తల్లులకు అందిస్తున్న సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ , గర్భిణీ మహిళలు పాల్గొన్నారు.

## పంచాయతీ భవన నిర్మాణాలు ప్రారంభించాలి

**గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి**

**ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి**

**పంచాయతీ విద్యుత్ బిల్లుల చెల్లింపు అభినందనీయం**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**





**కరీంనగర్, ఆగస్టు6,(నవగీతం)** మంజూరైన పంచాయతీ భవన నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.జిల్లా పంచాయతీ శాఖ సమీక్ష సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం రాత్రి జరిగింది.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్థలం గుర్తించి నిర్మాణానికి ఉత్తర్వులు మంజూరైన పంచాయతీ భవనాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని అన్నారు. నిర్మాణ దశలో ఉన్న భవనాల పనులను వేగవంతం చేయాలన్నారు. ఎల్ ఆర్ ఎస్ పెండింగ్ దరఖాస్తులను రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని అన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరణించిన మల్టీపర్పస్ కార్మికుల కుటుంబాలకు రావలసిన అన్ని ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చూడాలని తెలిపారు. కార్మికులకు అన్ని రకాల బీమా ప్రీమియాలు చెల్లించాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న విద్యుత్ బిల్లులలో 49 శాతం పంచాయతీల నుండి చెల్లించడం అభినందనీయమని అన్నారు. ఎంపీఓలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పెండింగ్ పనులను పర్యవేక్షించాలని అన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, డి ఎల్ పి ఓ లు, ఎంపీఓలు పాల్గొన్నారు.

## జయశంకర్ సార్ పోరాటం చిరస్మరణీయం



**కరీంనగర్,ఆగస్టు7,(నవగీతం)** తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన పోరాటం చిరస్మరణీయం అని.. ఆయన ఆశయాలు, అందించిన స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు ఆ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్వామి, ఆర్డీవో షర్మిల, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పలువురుని పరిమర్శించిన జువ్వాడి



**మల్లాపూర్,ఆగస్టు6,(నవగీతం)**మల్లాపూర్ మండలం గుండంపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన కుటుంబాలను జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు.
ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య వ్యవసాయ మార్కెట్ చెర్మెన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, మాజీ సర్పంచ్ మామిడి లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ బూపెల్లి దేవయ్య, ఉరుమడ్ల శేఖర్, అంతడుపుల గంగాధర్, కొంతం రాజశీ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

## గుండంపల్లి అంగన్వాడి కేంద్రంలో ఘనంగా తల్లి పాల వారోత్సవాలు



మల్లాపూర్,ఆగస్టు6,(నవగీతం) మల్లాపూర్ గుండంపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య మాట్లాడుతూ, నవజాత శిశువులకు తల్లిపాలు అత్యుత్తమ పోషకాహారమని, చిన్నారులకు పాలు,పాల ఉత్పత్తులు, సమతుల్య ఆహారం, పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా కార్యక్రమంలో చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం నిర్వహించడంతో పాటు, ఐదు నెలల గర్భిణీ మహిళలకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు మరియు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం, తల్లిపాలు ఎంతో అవసరమని అధికారులు, అంగన్వాడి సిబ్బంది వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కవిత, అంగన్వాడి టీచర్లు మిట్టపల్లి రాధా, మ్యాదరి రాధా, యం ఎల్ హెచ్ పి సరిత, ఆశా కార్యకర్తలు సంకోజి మానమ్మ, జల ఏ ఎన్ యం, విఓఏ నవ భారతి, మహిళలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మేజర్ గ్రామపంచాయతీలో జలసిరి గ్రామ సభ

**పలు సమస్యలు లేవనెత్తిన సామాజిక కార్యకర్త ఏ.వీ.ఆర్**




**మల్లాపూర్,ఆగస్టు6,(నవగీతం)** మల్లాపూర్ మండల కేంద్రం లో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జలసిరి గ్రామ సభ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ తెలంగాణ భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నామని,ప్రతి నీటి చుక్కను కాపాడుకోవడం,భూగర్భ జలాల పెంపు,వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడం,ఇంకుడు గుంతలు ప్రతి ఇంటి వద్ద, పాఠశాలలు మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం,కమ్యూనిటీ సోక్‌పిట్స్,పంట కుంటలు, ఊట కుంటలు గురించి వివరించారు.సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి మంచినీటి బావుల చుట్టూ కంచె ఏర్పాటు,నర్సరీ వద్ద దారి ఆక్రమణ,దోమల బెడద, పందుల బెడద వంటి సమస్య లు లేవనెత్తారు.వైకుంఠ రథం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ గడ్డం సోమ రెడ్డి, కార్యదర్శి గూరుడు శ్రీనివాస్, విద్యుత్ ఏ.ఈ వినీత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, జీ.పి.ఓ జల,సీనియర్ అసిస్టెంట్ మనోహర్ రెడ్డి,వార్డు సభ్యులు ఏనుగు లక్ష్మి,కొంపెల్లి రాకేష్, ముత్యాల గంగారాజం, అరికుప్పల రాజం,మహమ్మద్ షబ్బీర్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సమాఖ్య సభ్యురాళ్ళు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
7 ఆగస్టు 2026

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు చిరస్మరణీయం.

**వనపర్తి :** వనపర్తి క్యాంపు కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు.తెలంగాణ సిద్ధాంతకర్త, మేధావి, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వనపర్తి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధు గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కదిరే రాములు ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడిగా, తన జీవితమంతా తెలంగాణ కోసం అంకితం చేసిన మహోన్నత వ్యక్తిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.తెలంగాణకు జరిగిన అన్యాయాలను శాస్త్రీయ ఆధారాలతో దేశం ముందు వివరించి, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని బలంగా వినిపించిన గొప్ప మేధావి జయశంకర్ అని కొనియాడారు.ఆయన చూపిన మార్గంలోనే తెలంగాణ ఉద్యమం ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని గుర్తు చేశారు.నేటి యువత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని, తెలంగాణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు శరవందా, చుక్కరాజు, క్రాంతి, బి కృష్ణ,బ్రహ్మంచారి, కోట్లరవి, విభూది నారాయణ, జంగిడి రాజు, పాలరవి, రఘు, చీర్ల జనార్ధన్, మైనార్టీ నాయకులు ఫష, వసీం, బషీర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఏఎన్ఎంల అందోళన

**హైదరాబాద్ :** విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, డిమాండ్ల సాధన కోసం...ఏఎన్ఎంలు హైదరాబాద్ లో ఆందోళనకు దిగారు. కోఠి డిఎంఈ ఆవరణలో నిర్వహించిన మహా ధర్నా కు ఏఎన్ఎంలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు ఓటీపీ ఇవ్వడానికి భయపడుతున్నారని... యూనియన్ నాయకులు తెలిపారు. అంతే కాకుండా ఆధార్ ఫొటో కాపీ లేదా ఇతర వ్యక్తిగత వివరాలు ఇవ్వడానికి... ఆసక్తి చూపడం లేదన్నారు. దింతో ఎబిహెచ్ఏ రూపొందించడంలో ఫీల్డ్ స్థాయిలో చాలా క్లిష్టంగా మారుతోందని వెల్లడించారు. తమకు కేటాయిస్తున్న ఎఎన్ సి లక్ష్యాలను ప్రస్తుత జనాభా పరిస్థితులకు... అనుగుణంగా పున:పరిశీలించాలని కోరారు. అలాగే ప్రతి సేవకు ఎబిహెచ్ఎ లింకింగ్, ఓటీపీ తప్పనిసరి చేయడం వల్ల.. ఫీల్డ్ లో అనేక ఆచరణాత్మక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దయచేసి ఈ సమస్యలకు ఆచరణాత్మక పరిస్కారం చూపించి... ఎ ఎన్ఎంలపై ఉన్న అధిక ఆన్ లైన్ పనిభారాన్ని తగ్గించి... ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం కల్పించాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఏఎన్ఎంపై పని భారం తగ్గించాలని... రెగ్యులర్ పోస్టుల రిక్రూట్ మెంట్ ను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## జయశంకర్ సార్ కు సీఎం రేవంత్ నివాళులు

**హైదరాబాద్ :** తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ రి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు ఆ మహనీయుడికి ఘనంగా నివాళు లర్పించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పడంలో, ఉద్యమానికి దిశానిర్దేశం చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవని పేర్కొన్నారు. తన జీవితమంతా తెలంగాణ ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం అంకితం చేసిన గొప్ప విద్యావేత్త, మేధావి, ఉద్యమకారుడు జయశంకర్ ని కొనియాడారు. జయశంకర్ సారు గారి ఆశయాలు, విలువలు, నిబద్ధత నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాసేవ లక్ష్యాల సాధనకు ఆయన చూపిన మార్గం ఎల్లప్పుడూ ఆదర్శప్రాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## దొంగతనాల ముఠా అరెస్ట్:

## 12 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

**హైదరాబాద్ :** వివిధ కమిషనరేట్ల పరిధిలో వరుసగా ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్‌జిల్లా నేరస్థులతో పాటు ఒక చోరీ సొత్తు గ్రహీతను జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. 12,00,000 విలువైన బంగారు, వెండి ఆభరణాలు, వాహనాలు మరియు పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఘటన వివరాలు: పోలీసు కథనం ప్రకారం.. ప్రధాన నిందితుడు దేరంగుల హరిబాబు అలియాస్ నాని గత జూన్ 2026లో జైలు నుండి విడుదలయ్యాడు. జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత తన్నీరు సూర్య, నరాల రాహుల్‌లతో కలిసి ఒక ముఠాగా ఏర్పడి మళ్లీ వరుస ఇళ్ల దొంగతనాలకు తెరలేపాడు. నిందితుడు హరిబాబుపై గతంలో 27 కేసులు, సూర్యపై 13 కేసులు, రాహుల్‌పై 3 కేసులు నమోదు కాగా, వీరిపై పాత నేర చరిత్ర ఉంది.ఈ ముఠా ఇటీవల గౌరారం, సంగారెడ్డి టౌన్, పోచారం ఐటీ కారిడార్, నాగోల్, కుషాయిగూడ, మేడిపల్లి, వనస్థలిపురం పోలీసు స్టేషన్ల పరిధిలో మొత్తం 11 నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది.

## 71 కొలిక్కి ఫోన్ ట్యాపింగ్ కేసు

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం అత్యంత కీలకమైన చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ కేసులో వేగంగా విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం ఆగస్టు 15 నాటికి నాంపల్లి కోర్టులో భారీ అదనపు ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు వేగంగా సన్నాహాలు చేస్తోంది. దాదాపు 600 మందికి పైగా బాధితులు, సాక్షుల వాంగ్మూలాలు , ఇప్పటికే అరెస్ట్ అయిన నిందితుల కన్ఫెషన్ స్టేట్‌మెంట్స్ ఆధారంగా పక్కా సాంకేతిక ఆధారాలతో ఈ అదనపు అభియోగపత్రాన్ని సీనియర్ అధికారులు రూ పొందించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.ఈ ఛార్జ్‌షీట్ దాఖలు ద్వారా దేశ చట్టపరమైన చరిత్రలోనే ఒక అరుదైన మైలురాయి నమోదు కాబోతోంది. సాధారణంగా కేసులలో ప్రయోగించే ఐపీసీ సెక్షన్లతో పాటు చట్టవిరుద్ధంగా వ్యక్తుల వ్యక్తిగత స్వేచ్ఛపై నిఘా పెట్టినందుకు గాను ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ కింద అత్యంత కీలకమైన సెక్షన్లను జోడిస్తూ ఈ ఛార్జ్‌షీట్ సిద్ధం చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి రక్షణ నిఘా వ్యవస్థలను రాజకీయ స్వలాభం కోసం వాడారనే తీవ్ర ఆరోపణల నేపథ్యంలో టెలిగ్రాఫ్ చట్టం కింద నమోదు చేస్తున్న సెక్షన్లు నిందితులకు చట్టపరంగా పెద్ద చిక్కులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది.గత కొద్ది నెలలుగా కొనసాగుతున్న విచారణలో సిట్ అధికారులకు లభించిన సాంకేతిక ఆధారాలు , డిజిటల్ ఫోరెన్సిక్ డేటా ఈ కేసులో ప్రాణవాయువులా మారాయి. రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధులతో సహా నగరంలోని పలువురు ప్రముఖుల ఫోన్‌లను నిబంధనలకు విరుద్ధంగా ట్యాప్ చేసినట్లు సేకరించిన ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. నిందితులు డేటాను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించినప్పటికీ, రికవర్ చేసిన హార్డ్ డిస్క్‌లు, కన్ఫెషన్స్ ఆధారంగా బలమైన సాక్ష్యాధారాల నెట్‌వర్క్‌ను సిట్ రూపొందించింది. ఈ సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ కేవలం క్రిమినల్ పరిణామాలకు మాత్రమే పరిమితం కాకుండా, తెలంగాణ రాజకీయ చిత్రాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన పలువురు ఉన్నతాధికారుల పాత్ర, పొలిటికల్ మాస్టర్‌మైండ్స్ చుట్టూ ఈ విచారణ ఉచ్చు బిగుస్తోంది. ఆగస్టు 15న ఛార్జ్‌షీట్ కోర్టు ముందుకొస్తే, ఇప్పటివరకు తెరవెనుక ఉన్న పలువురు ప్రముఖుల పేర్లు అధికారికంగా వెలుగులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.ఈ అదనపు అభియోగపత్రంలో రాజకీయ నేతల పేర్లు ఉంటాయా అన్నది కీలకంగా మారింది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వంటి వారి పేర్లు గతంలో ప్రచారం లోకి వచ్చాయి. నేరం రుజువైతే ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ కింద వచ్చే శిక్షలు నిందితులకు తీవ్రమైన పరిణామాలను మిగుల్చుతాయి. ఈ కేసులో చట్టపరమైన లొసుగులు లేకుండా పక్కాగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ సీబీఐ తరహాలో సిట్ అధికారులు తమ నివేదికలను అలైన్ చేస్తున్నారు. ఆగస్టు 15 నాటికి నాంపల్లి కోర్టులో సమర్పించబోయే అదనపు ఛార్జ్‌షీట్ తెలంగాణ పొలిటికల్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. 600 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు, ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం సెక్షన్లు మరియు రికవర్ చేసిన డిజిటల్ సాక్ష్యాధారాలతో సిట్ సిద్ధం చేసిన ఈ విచారణ నివేదిక ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అసలు సూత్రధారులకు ఉచ్చు బిగిస్తుందో లేదో వేచి చూడాలి!

# ఎయిర్ పోర్ట్ ఎఫెక్ట్... ఆ 30 గ్రామాలకు కనెక్టివిటీ కట్

**అదిలాబాద్ :** ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భూసేకరణలో అనుకుంట ప్రధాన రహదారి కూడా చేరనుండటంతో 30 గ్రామాలకు కనెక్టివిటీ లేకుండా పోతుంది. దీంతో ప్రత్యామ్నాయంగా కచికంటి మీదుగా కొత్త బైపాస్ నిర్మించనున్నారు. 66 అడుగుల వెడల్పుతో రూపొందనున్న ఈ రహదారి కోసం ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. బంగారుగూడ, కచికంటి మీదుగా జిల్లా కేంద్రానికి సులభంగా చేరుకునేలా ఈ మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. విమానాశ్రయ నిర్మాణం కారణంగా రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణంతో జిల్లాలో రహదారి వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. విమానాశ్రయం కోసం చేపట్టనున్న భూసేకరణలో ప్రస్తుతం వేలాది మంది వినియోగిస్తున్న అనుకుంట ప్రధాన రహదారి కూడా చేరనుండటంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుపై దృష్టి సారించారు. దాదాపు 30 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా కొత్త బైపాస్ రహదారిని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణం నుంచి ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని కచికంటి గ్రామానికి వెళ్లేందుకు శ్రీరాంకాలనీ, కుమ్మరివాడ, విమానాశ్రయ స్థలానికి ఆనుకుని ఉన్న ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ మీదుగా ప్రయాణిస్తున్నారు. విమానాశ్రయ నిర్మాణంతో ఈ మార్గం మూసివేయబడే అవకాశం ఉండటంతో కచికంటి నుంచి బంగారుగూడ ప్రధాన రహదారిని అనుసంధానించే కొత్త రహదారిని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం కచికంటి గ్రామ సమీపంలో కొత్త బైపాస్ నిర్మించి, అక్కడ అవసరమైన భూసేకరణ చేపట్టనున్నారుకొత్త రహదారిని 66 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మార్గం ద్వారా బంగారుగూడ, కచికంటి మీదుగా ఆదిలాబాద్ పట్టణానికి సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుంది. దీంతో విమానాశ్రయ నిర్మాణం వల్ల కలిగే రవాణా ఇబ్బందులు తగ్గడంతో పాటు భవిష్యత్ ట్రాఫిక్



అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ రహదారిని రూపొందిస్తున్నారు. ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడ, రాముల్‌గూడ, కొత్తగూడ, యశ్వంత్‌గూడ, మత్తడిగూడ, బూర్నూర్, అడ్డగుట్ట, శివఘాట్, కుంభఝరి, టాక్లీ గ్రామాలతో పాటు సాత్నాల మండలంలోని రామాయి, జాముల్‌ధరి, న్యూరాంపూర్, సాత్నాల, సుందరగిరి, మాంగూర్ల, కాన్పమేడిగూడ, మేడిగూడ, జామ్ని, మారుగూడ, తోయగూడ, సైద్‌పూర్, సహేజ్, సాంగ్వి, జామ్డ గ్రామాల ప్రజలు నిత్యం ఈ దారినే వినియోగిస్తున్నారు. అదేవిధంగా గాదిగూడ మండలంలోని పరస్వాడ, లోకారి, గాదిగూడ గ్రామాల ప్రజలు కూడా జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు.ఇవే కాకుండా ఆదిలాబాద్ అర్బన్ పరిధిలోని బంగారుగూడ, అనుకుంట గ్రామాల ప్రజలకు కూడా ఇదే ప్రధాన రహదారి. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని మరికొన్ని గ్రామాల వాసులు కూడా ఆదిలాబాద్‌కు రావడానికి ఈ దారినే ఎక్కువగా ఉపయోగిస్తుండటంతో రోజూ ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా అనుకుంట ప్రాంతం చుట్టూ ఉన్న వ్యవసాయ భూములను ప్రభుత్వం సేకరించనుంది. దీంతో ఖానాపూర్ సమీపంలోని అనుకుంట మలుపు నుంచి అనుకుంట గ్రామం వరకు ఉన్న ప్రస్తుత రహదారి విమానాశ్రయ పరిధిలోకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రత్యామ్నాయ రాకపోకలు కల్పించేందుకు కొత్త రహదారి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంది.

# సింగరేణికి ఒడిశా నైనీ బొగ్గు

**మంచిర్యాల :** సింగరేణి కొల్లరీస్ కంపెనీ లిమిటెడ్ చరిత్రలో మరో మైలురాయిని నమోదు చేసుకుంది. ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాక్ నుంచి బయలుదేరిన తొలి బొగ్గు రైల్వే రేక్ మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (రాఖఖ) కి విజయవంతంగా చేరుకుంది. ఇది తెలంగాణ రాష్ట్ర భద్రతలో చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఈ తొలి రేక్ లో 59 బాక్స్ వ్యాగన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 4 వేలు టన్నుల అత్యుత్తమ జీ-10 గ్రేడ్ బొగ్గు ఉంది. ఒడిశా నుంచి 1131 కిలోమీటర్ల దూరం ప్రయాణించి జైపూర్ రాఖఖకి చేరుకుంది. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, ఎం.తిరుమల రావు రేక్ కు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్ లోడింగ్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాఖఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్, గుర్తింపు పొందిన , ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, అధికార సంఘ ప్రతినిధులు , ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం సందర్భంగా సింగరేణి యాజమాన్యానికి అధికారులకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కోసం కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తొలి రైల్ రేక్ రావడం మనందరకీ గర్వకారణం అన్నారు మల్లు భట్టి విక్రమార్క. సింగరేణి చరిత్రలో ఇది చారిత్రక ఘట్టం అన్నారు. తెలంగాణ విద్యుత్ అవసరాలు తీర్చడంలో, రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి పాత్ర ఎనలేనిది అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సింగరేణిని మరింత బలోపేతం చేస్తూ, ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. నైనీ బొగ్గు బ్లాక్ ను 2015లో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సింగరేణికి కేటాయించింది. దాదాపు తొమ్మిదేళ్లు నిలిచిపోయిన ఈ ప్రాజెక్టును ప్రస్తుత ప్రభుత్వం వేగవంతం



చేసింది. 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తి అధికారికంగా ప్రారంభమైంది. ఈ బ్లాక్ లో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఏడాదికి కోటి టన్నుల ఉత్పత్తి సామర్థ్యం, 36ఏళ్ల గని జీవితకాలం ఉంది. నాణ్యమైన జీ 10 గ్రేడ్ బొగ్గు రాఖఖకి నిరంతర సరఫరా అందించడంలో రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తికి దీర్ఘకాలిక స్థిరత్వం లభించనుంది. సింగరేణి అధికారులు ఈ విజయాన్ని సంస్థ విస్తరణలో కొత్త అధ్యాయంగా అభివర్ణించారు. ఇతర రాష్ట్రాల్లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదరగడానికి ఇది మొదటి అడుగు అని పేర్కొన్నారు. నైనీ బొగ్గు సరఫరాతో రాఖఖ ఇంధన భద్రత పెరగడమే కాకుండా, రాష్ట్ర విద్యుత్ రంగం మరింత బలపడనుంది. ఈ చారిత్రక ఘట్టం సింగరేణి ఉద్యోగులు, కార్మికుల కృషికి నిదర్శనం. తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో మరిన్ని అభివృద్ధి పథకాలు ముందుకు సాగనున్నాయని అన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.

# ప్రొఫెసర్‌కు ఘనంగా నివాళి

**హైదరాబాద్ :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తం గా నివాళి కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఆయన సేవలను గుర్తు చేసుకు న్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ప్రత్యేక తెలంగాణ కోసం జయశంకర్ జీవితాంతం నిరంతరం శ్రమించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు ఆయన సేవలను ఎప్పటికీ మరువరని చెప్పారు. ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని గణాంకాలతో దేశం ముందు ఉంచి, ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా నిలిపారని కొనియాడారు. ఆయన చూపిన మార్గం, ఉద్యమానికి అందించిన స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాల సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా జయశంకర్‌కు ఘన నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఆయన జీవిత లక్ష్యమని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌కు జయశంకర్ గురువుతో సమానమని చెప్పారు. తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో విస్తరింపజేసి ఉద్యమానికి బలమైన దిశ చూపిన మహనీయుడిగా అభివర్ణించారు. ఆయన సేవలకు గుర్తింపుగా భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ కళాశాలకు జయశంకర్ పేరు పెట్టామని గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి నివాళు లర్పించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా జయశంకర్‌ను స్మరించారు. తెలంగాణ కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.మరోవైపు కవిత నాయకత్వంలోని తెలంగాణ రక్షణ సేన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తోంది. జయశంకర్‌కు నివాళి అర్పించడంతో పాటు సామాజిక న్యాయం అమలు చేయాలని డిమాండ్ చేయనుంది. సిద్ధిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయ న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభు త్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట ప్రాంతంతో జయశంకర్ కు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయ శంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యా నించారు. నాడు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని... రేవంత్ ఒక్క సారి కూడా 'జై తెలంగాణ' అని అనలేదని విమర్శిం చారు. గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునః సమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
7 ఆగస్టు 2026



# ఆ భ్రమ నుంచి బయటపడాలి!

యాక్షన్‌తో పాటు తనదైన శైలిలో చక్కటి కామెడీని పండిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు హీరో వరుణ్‌తేజ్. ఆయన నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో హారర్, సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ సంస్థలు నిర్మించాయి. నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్ ఇదని, రెండున్నర గంటల పాటు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుతుందని వరుణ్‌తేజ్ చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన విలేకరులతో ముచ్చటించారు. దర్శకుడు గాంధీ ఈ కథ చెప్పినప్పుడు నవ్వుతూనే ఉండిపోయా. కోవిడ్ తర్వాత ఎక్కువగా సీరియస్, యాక్షన్ సినిమాలొచ్చాయి. ఎప్పటి నుంచో హాస్య ప్రధానంగా ఓ సినిమా చేయాలనుకుంటున్నా. ప్రేక్షకుల్ని రెండున్నర గంటల పాటు నవ్వించాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాను.

పొడవుగా, భారీ కటౌట్‌తో కనిపించే హీరోలకు కామెడీ సినిమాలు అంతగా సెట్‌కావనే అభిప్రాయం ఉంది. ఆ భ్రమ నుంచి బయటకు రావాలి. నిజానికి నటుడు అన్ని రకాల పాత్రలు చేయాలి. పాత్రను సరిగ్గా డిజైన్ చేస్తే అద్భుతంగా కామెడీ పండుతుంది. 'కొరియన్ కనకరాజు'లో యాక్షన్‌తో పాటు కామెడీ కూడా బాగా కుదిరింది.

ఈ సినిమా ప్రమోషన్స్‌ని చాలా కొత్తగా నిర్వహించాం. కంటెంట్‌కు కనెక్ట్ అయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలకు రూపకల్పన చేశాం. ట్రైలర్‌లోనే కథ మొత్తం చెప్పి ప్రేక్షకుల్ని సినిమా కోసం ముందస్తుగా ప్రిపేర్ చేశాం. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలకు కూడా సరిపడా సమయం దొరకడంతో సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. దాంతో విజయంపై ధీమా పెరిగింది.

ఈ సినిమా కోసం కొరియన్ భాష నేర్చుకున్నా. నాకు కొత్త పాత్రలు చేయడం, కొత్త వ్యక్తిలా జీవించడం చాలా ఇష్టం. ప్రతి పాత్రలో నేను కనిపించకుండా..నా క్యారెక్టర్ మాత్రమే కనిపించేలా కష్టపడతాను. ఈ సినిమాలో నా పాత్ర రెండు భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. నటుడిగా ఛాలెంజింగ్ రోల్ చేసినందుకు సంతృప్తిగా ఉన్నా. ఇందులో నా హెయిర్‌స్టైల్ మొదలుకొని బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ...ఇలా ప్రతీ విషయం కొత్తగా అనిపిస్తుంది.

ఈ సినిమా ప్రీమియర్‌షోస్ బుకింగ్స్ అన్నీ ఫుల్ అయిపోయాయి. ఓవర్‌సీస్‌లో కూడా సూపర్‌రెస్పాన్స్ వస్తున్నది. ప్రచార చిత్రాల ద్వారా సినిమా కంటెంట్ ప్రేక్షకులకు బాగా రీచ్ అయింది. సినిమా కూడా అందరి అంచనాలకు తగినట్లుగా ఉంటుంది. నా తదుపరి సినిమా 'బరి' తాలూకు ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. పూర్తి స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే కథ ఇది. నేను చిన్నప్పటి నుంచి వాలీబాల్ ఆడేవాడిని. అది ఈ సినిమాకు బాగా హెల్ప్ అవుతున్నది. ఇందులో మా నాన్న కూడా కీలక పాత్రను పోషిస్తున్నారు. ఆయనతో కలిసి నటించాలనే కోరిక 'బరి' సినిమాతో నెరవేరబోతున్నది.



## 100 కోట్ల వ్యూస్‌తో చరిత్ర సృష్టించిన 'రామాయణ' ట్రైలర్

నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణ: పార్ట్-1' ట్రైలర్ అన్ని భాషలు, డిజిటల్ వేదికలు కలిపి 100 కోట్ల (1 బిలియన్) వ్యూస్ సాధించి భారతీయ సినీ చరిత్రలో అరుదైన రికార్డు నెలకొల్పింది. ఇప్పటివరకు ఏ భారతీయ సినిమా ట్రైలర్ ఈ ఘనత సాధించలేదు. హిందీ ట్రైలర్ ఒక్కటే 'వరల్డ్ ఆఫ్ రామాయణ' ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 588 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర వేదికల్లో కూడా భారీ స్పందన లభించింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్ర ట్రైలర్ అద్భుతమైన విజువల్స్, విజువల్ ఎఫెక్ట్స్, హాన్స్ జిమ్మర్--ఏ.ఆర్. రెహమాన్ సంగీతంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రబృందం ఇంగ్లిష్ ట్రైలర్‌ను కూడా విడుదల చేసింది. అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఏఐ ఆధారిత సరికొత్త లిప్-సింక్ టెక్నాలజీని ఉపయోగించి ఈ వెర్షన్‌ను రూపొందించారు. అంతేకాకుండా, ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా సోనీ పిక్చర్స్ విడుదల చేయనుండటం విశేషం.

# ఫ్యామిలీ యాక్షన్ డ్రామా

విక్రమ్ సహిదేవ్, సంధ్యావశిష్ఠ, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం'అనకాపల్లి' త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నటుడు సోనూసూద్ ముఖ్యఅతిథిగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. తన సొంత ఊరు అనకాపల్లిలో ఈ వేడుక జరగడం ఆనందంగా ఉందని, ఫ్యామిలీ..యాక్షన్ అంశాల కలబోతగా ఈ సినిమా ఆకట్టుకుంటుందని నిర్మాత త్రినాథరావు నక్కిన తెలిపారు. అనకాపల్లిలోని రియల్ లొకేషన్లలో షూటింగ్ చేశామని నిర్మాత కాండ్రేగుల నాయుడు చెప్పారు. ఈ వేడుకలో చిత్రబృందమంతా పాల్గొన్నారు.






## కాకులు తల్వార్లు పడితే..

నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సికింద్రాబాద్ నేపథ్య పీరియాడిక్ చిత్రం 'ది ప్యారడైజ్'. నిర్మాణ దశ నుంచే ఈ సినిమా భారీ హైప్‌ని క్రియేట్ చేస్తున్నది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో జడల్ అనే పవర్‌ఫుల్ పాత్రలో నాని కనిపించబోతున్నారు. 'ఈ జాగా ఎవరిది? ఈ దేశమెవరిది? అంటూ నాని బిగ్గరగా నినాదాలు చేస్తూ తన వారిలో చైతన్యాన్ని రగిల్చే సన్నివేశాలతో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. ప్యారడైజ్ తాలూకు ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ తన జాతి జనుల కోసం ఆధిపత్య శక్తులతో పోరాడే యువకుడిగా నాని పాత్రను శక్తివంతంగా చూపించారు. 'అణచబడ్డ మన జాతి మర్లబడాలే..ఛీ అని చీదరించుకున్న నలుపురంగే మన జెండా. కాకి దానిమీద గుర్తు. కాకులు తల్వార్లు పడితే ఏమవుతుందో చూపిద్దాం' అంటూ నాని చెప్పిన సంభాషణలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## 20 నిమిషాల ఎపిసోడ్ కోసం 60 రోజుల షూటింగ్..

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా పాన్ వరల్డ్ స్థాయిలో అత్యంత భారీ బడ్జెట్‌తో 'వారణాసి' అనే చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా రెండు పాత్రల్లో కనిపించనున్నారు మహేశ్‌బాబు. దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణం ఎపిసోడ్‌లో రాముడిగా మహేశ్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉంటుందని సమాచారం. తెరపై కనిపించే ఈ 20 నిమిషాల ఎపిసోడ్ చిత్రీకరణకు దాదాపు 60 రోజులు పట్టిందట. ఇక ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం వరకు ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరగ్గా, మహేశ్ పాల్గొన్నారట. ఆ తర్వాత చిన్న బ్రేక్ తీసుకుని వెకేషన్ వెళ్లారు. మరి... బర్త్ డే సందర్భంగా 'వారణాసి' చిత్రం నుంచి మహేశ్‌బాబు ప్రత్యేక పోస్టర్‌ని కానీ వేరే ఏదైనా అప్‌డేట్ కానీ ఇస్తారేమో చూడాలి. ఎస్ఎస్ కార్తికేయ, కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది. దాదాపు 120 దేశాల్లో 'వారణాసి'ని రిలీజ్ చేయనున్నారు.

**విదేశాల్లో బర్త్‌డే సెలెబ్రేషన్స్**

నటుడిగా ఎంత బిజీగా ఉన్నా ఫ్యామిలీకి తగినంత సమయాన్ని కేటాయిస్తుంటారు మహేశ్‌బాబు. షూటింగ్స్‌కి గ్యాప్ దొరికినప్పుడు ఫ్యామిలీతో వెకేషన్ ప్లాన్ చేసుకుంటారు. ప్రస్తుతం తన కుటుంబంతో సహా మహేశ్ విదేశాల్లో ఉన్నారు. ఈ నెల 9న ఈ హీరో పుట్టినరోజు. సో... బర్త్ డే వేడుకను అక్కడే జరుపుకుంటారు. ఆ తర్వాత హైదరాబాద్ చేరుకుని 'వారణాసి' సినిమా షూట్‌లో పాల్గొంటారు.



Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.